శ్రీ

చింతామణి.

ఇది మాసమున కొకసారి ప్రకటింపఁబడును.

సంపుటము ౨] రాజమహేంద్రవరము విజయసంవత్సర వైశాఖమాసము. [సంచిక ౧౧.

పత్రికా విమర్శనము.

ఉపాధ్యాయోపయోగిని— ఉపాధ్యాయులు మొదలగువారి యుపయోగము నిమిత్తము బందరునం దీతెలుఁగుపత్రిక మాసమున కొకపర్యాయము ప్రచురింపఁబడుచున్నది. ఇందుపాధ్యాయులకుఁ గావలసిన విద్యావిషయములు మాత్రమే కాక వృత్తాంతములుకూడ నుండును. ఇదివఱకు ప్రకటింపఁబడిన సంచికలనుబట్టి చూడఁగా, ఈపత్రిక విద్యార్థులకును ఉపాధ్యాయులకును మహోపయుక్తమైనదిగాఁ గానఁబడుచున్నది.

నీతికథలు.

గాడిద, ముండ్లపొద.

పొలముకాపొకఁడు తనపొలములో పండిన నానావిధములయిన ధాన్యములను మూటలుకట్టి యొక గాడిదమీఁద వేసి యింటికి మోపించుకొని పోవుచుండఁగా, ఆగాడిద త్రోవలో ముండ్లపొద నొకదానిని జూచి యాఁకలి గొనియుండుటచేత దానియొద్దకు పరుగెత్తి యాకులుకొఱికి తినుచు, "నాకు పనికిరాకపోయినను నే నిప్పుడు మోసికొని పోవుచున్న యీ ధాన్యముతో రుచ్యములైన విందులుగుడిచి యెందఱో యానందింపఁ దలఁచుకొని యుందురు. వీనితోఁ జేసిన యేపిండివంటకంటెను నానోటికీ ముండ్లపొదయే యెక్కువ రుచికరముగా నుండును" అని తనలోఁ దా నాలోచించుకొన మొదలుపెట్టెను.

గీ॥ ఒక్కనికి మంచియన్నమై యుండునదియె
నన్యునకు నుర్విలో విషమగుచు నుండు,
కావునను, లోకమందు సుఖంబు కలుగు
వివిధ జనులకు వివిధ వస్తువుల వలన

భరతపక్షి, దానిపిల్లలు.

ఒక భరతపక్షి తాను పిల్లలుపెట్టిన చేనుపండి కోఁతకు సిద్ధముకాఁగా, తనపిల్లలకు ఱెక్కలువచ్చి గూటిలోనుండి యెగరఁగలుగుటకు లోపలనే కోఁతగాఁ(డు)వచ్చి పొల మెక్కడఁగోయుదురో యను భయముచేత తాను మేఁత తెచ్చుటకయి వెళ్ళఁబోవునప్పుడు తనపిల్లలను బిలిచి తాను లేనిసమయమునం దెవ్వరేమనుకొందురో యామాటలన్నియు శ్రద్ధతో విని తాను వచ్చినతరువాతఁ దనతోఁ జెప్పవలసినదని చెప్పిపోయెను. అది వెళ్ళినతరువాత పొలముకాపక్కడకు వచ్చి తనకొడుకుతో "పొలముపండి కోఁతకు సిద్ధమయినది. ఱేపటిదినము నీవుపోయి మన పొరుగువారిని చేనుకోయుటకు సాయమురండని పిలువు" అని చెప్పెను. ఆ మాటలువిని తల్లి రాఁగానే చెప్పి పిల్లలు తమ్ము వెంటనే మఱియొకచోటికిఁ దీసికొనిపొమ్మని యడుగఁగా, "మీరు తొందర పడవక్కఱ లేదు పొలముకాపు పొరుగువారి తోడ్పాటు నమ్ముకొన్నందున ఱేపు కోఁత జరగదు" అని తల్లి వానికి ధైర్యము చెప్పెను. మఱునాఁడు మేఁతనిమిత్తము పోవునప్పుడు కూడ తల్లి పిల్లలకు గతదినమునఁ జెప్పినట్లే చెప్పిపోయెను. అటుపిమ్మట పొలముకాపక్కడకువచ్చి పొరుగువారు వత్తురేమోయని కొంతసేపు కాచుకొనియుండి వారెంతసేపటికిని రాకపోఁగా, కొడుకును జూచి "మనమిఁక పొరుగువారిని నమ్ముకొన్న కార్యము లేదు. నీ వీసాయంకాలమేపోయి నీ పినతండ్రి మొదలయిన మనచుట్టములను ఱేపు తెల్లవాఱకమునుపే కోఁతకు తోడురండని చెప్పిరా" అని చెప్పిపోయెను ఈసంగతికూడ పిల్లలు తల్లి రాఁగానేచెప్పి భయపడసాగిరి అప్పుడు తల్లి పిల్లల జడుపుదీర్చి "మీరువిన్న దింతేయయిన పక్షమున మీరు భయపడవలసిన పనిలేదు. మఱియొకరి పనినిమిత్తమై చుట్టము లెప్పుడును పిలువఁగానే రారు. ఱేపటిదిన మేమిజరగునో మీరు శ్రద్ధతో విని నాకుచెప్పుఁడు." అని మఱునాఁడు మరల నెర తెచ్చుటకయి పోయెను. నాఁడును నిన్నటివలెనే పొలముకాపు ప్రాతఃకాలముననే వచ్చి వేచియుండి యేవేళకును చుట్టములు వచ్చుజాడ కానక విసిగి కొడుకునుజూచి "మన మితరుల తోడ్పాటున కాసపడఁగూడదు ఱేపు నీవు వచ్చునప్పుడు మంచికొడవండ్లు రెండు తీసికొనిరా. ఱేపు మనమిద్దఱమే చేను కోఁత మొదలుపెట్టుదము" అని చెప్పిపోయెను. ఆమాటలు పిల్లలు మరల చెప్పఁగానే తల్లి "ఇఁక మనమిక్కడ నిలువఁగూడదు. పొలముకాపు తాను స్వంతముగా పనిచేసికోఁ దలఁచినప్పుడు రాకమానఁడు. మనము శీఘ్రముగా పోవలెను" అని యప్పుడే తన పిల్లలను దీసికొని మఱియొకచోటికిఁ

బోయెను. అనుకొన్నట్టుగా మఱునాటి యుదయకాలముననే పొలము కాపును కొడుకును వచ్చి పొలము కోఁత మొదలుపెట్టిరి.

గీ॥ పనిని జక్కఁగ నొనరింప వలయునన్న
స్వయముగాఁ దానె చేసికొనవలయు నెప్డు,
కార్యమును దానె చేసికోఁగలుగునేని,
పరుల సాహాయ్యమున కాశపడఁగఁ దగదు.

నక్క, కోడి.

నక్క యొకటి యొకనాఁటి తెల్లవాఱుజామున కోళ్లదొడ్డివద్దకు వచ్చి తన నిమిత్తమయి వేసియున్న వలలో పడెను అది యొకకోడిపుంజు దూరమునుండి చూచి, అటువంటి భయంకరమయిన శత్రువును సమీపించుట కొక్కసారిగా సాహసింపలేక భయపడుచు మెల్లమెల్లగాఁ గొంతదాపునకువచ్చి, గుండెలు తటతట కొట్టుకొనఁగా చాటుననుండి తొంగిచూచెను. నక్క దానిరాకచూచి చేరఁబిలిచి మాయ యచ్చుపడునట్లుగా "ఓమిత్రమా! నాకిక్కడ నెటువంటి కష్టము సంప్రాప్తమయినదో చూచితివిగదా? ఈ యాపత్తంతయు నాకు నీమూలమున వచ్చినది. నేను గ్రామసంచారముచేసి యీ కంచెదాపుననుండి యింటికిఁ బోవుచుండఁగా నింతలో నీకంఠస్వరము వినఁబడి నీ క్షేమ సమాచారము విచారించిపోవలెనని వచ్చి యీవలలో పడినాను. కాఁబట్టి నీవీయురిని ఛేదించుటకయి నాకొక కత్తిని తెచ్చి పెట్టవలెను. ఆపని నీచేతకాకపోయెనా, నే నీయురిత్రాటిని నా పండ్లతో తెగ కొఱుకువఱకును నాదుర్దశను నీవెవ్వరితోను జెప్పక యూరకుండుము" అని మంచి మాటలు చెప్పెను. ఆకోడిపుంజు మాఱుమాటాడక పరుగెత్తుకొనిపోయి బిగ్గఱగాఁ గూసి వెంటనే తనయజమానుని కా నక్కవార్త తెలియఁబఱిచెను. అంతట వాఁడొక దుడ్డుకఱ్ఱ తీసికొనివచ్చి పాఱిపోవుట కవకాశము కలుగకముందే నక్కను చావమోదెను.

గీ॥ ముఖము ముందఱి స్తుతులకు మోసపోక
తాను వారింపఁదగు నాపదల విధంబు
ముందుగ విమర్శయొనరించి బుద్ధిమంతుఁ
డర్హులకు మాత్ర ముపకార మాచరించు.



ఎలుఁగుబంటి, సింహము, లేడి.

ఒక లేడిని జంపి యది తనకే రావలెనని యెలుఁగుబంటియు, తనకే రావలెనని సింహమును తగవులాడి, ఘోరయుద్ధము చేసి యలసి సొమ్మసిల్లి సింహభల్లూకములు రెండును క్రిందపడెను. అవి యట్టి యవస్థలో నుండఁగా నప్పుడా దారిని బోవుచున్న నక్కయొక్కటి చూచి మెల్లగా సమీపమునకువచ్చి యవి కదలమెదల లేకుండుట కనిపెట్టి యాలేడిని నోటఁ గఱచుకొని నిర్భయముగా నడువసాగెను. ఆచౌర్యమును దాపుననేయుండి కన్నులమంటఁగాఁ జూచుచుండియు నేమియుఁ జేయఁ జాలక సింహభల్లూకములు నిట్టూర్పులు పుచ్చుచు "ఇదియంతయు మనకు పరస్పరవివాదమువలన వచ్చినలాభము. మన యిద్దఱిలో నొక్కరికిని దక్కకుండ నడుమ పాడు నక్కయొక్కటివచ్చి యీలేడిని మనకన్నులయెదుటనే యీడ్చుకొనిపోవుచున్నది." అని విచారింప సాగెను.

గీ॥ తాము తమలోన నధికులు తగవులాడ
నడుమ నల్పులు లాభంబుఁ బడయుచుంద్రు
పోరునష్టము మఱిమఱి పొందులాభ
మనెడు లోకోక్తి మిగుల సత్యంబు గాదె?

మృచ్ఛకటికము. (౪౭౮-పుట శేషము.)

చేటి—మైత్రేయా! నీవుండు, నేనే యామెకు శుశ్రూష చేయఁబనివినెదను
(అని యట్లు వలువలు దెచ్చియిచ్చినది)

విదూ—(అపవారితకముగా) ఓయీ! వయస్య! ఈమె నేదైనఁ బల్కరింతునా?

చారు—అట్లు చేయఁదగునోయి!

విదూ—(ప్రకాశముగా) చంద్రాలోకమె నశింప దుర్దినప్రాయమయ్యెడు నిట్టి యంధకారమందు నీవిందురా నేమినిమిత్తమమ్మా!

చారు—ఓసీ! ఈబ్రాహ్మణుఁడు తిన్నని మనసువాఁడుసుమా!

వసం—కాదు! నిపుణుఁడని చెప్పనొప్పునే!

చేటి—ఆరత్నావళి మూల్యమెంతయని యడుగఁగా నిందీయమ వచ్చినది సుండీ!

విదూ—(జనాంతికముగా) ఓయీ! నేఁ జెప్పనేచెప్పితినిగాదా! రత్నావళి యల్పమూల్యము సువర్ణభాండము బహుమూల్యము కనుకఁ బరితుష్టిపడక మరొండు యాచింప నీమె వచ్చిన దయ్యెనని!

చేటి—అది యీయమ తనదని చెప్పి జూదమునఁ బన్నిదంబు పఱచి కోల్పోయెను. ఆగెల్చుకొన్న సభికుఁడు రాజవార్తాహారి యెందేగెనోయని—

విదూ—ఓసీ! తలఁపులోని మాటె పలికెదు!

చేటి—దానికై వెదకెదము. ఈలోపల నీసువర్ణభాండమును గ్రహింపవలయు!
(అని చూపించినది.)

విదూ—(తేఱిపాఱఁ జూచుచు విచారించుచున్నాఁడు.)

చేటి—ఇదిచూచి యింతసేపాలోచించెదవు? ఏమయ్యా! ఇది నీవెప్పుడయిన ముందు చూచియుందువా?

విదూ—కాదోసి! దీని పనివానితనముం జేసి కన్నులీవలకు రాకుండఁగట్టువడ్డవిగదే!

చేటి—నీదృష్టి భ్రమసినది గాని యీ సువర్ణభాండమే యిది!

విదూ—(హర్షముతో) ఓయీ మిత్రమా! సువర్ణభాండ మిదియ దిగో! వెనుక మన గృహమందుఁ జోరు లపహరింపలేదా? అదే!

చారు—వయస్యా!

క॥ అపహృతమగు న్యాసము తిరి।గి పుచ్చివేయఁగలేక కృత్రిమముగ నా।
నెపమును బన్నితి మిటు ని।క్కపుగతి ప్రస్తుతపదంబుగనె నిప్పటికిఁ॥

విదూ—ఓయీ మిత్రమా! బ్రాహ్మణ్యమంతటిమీఁదఁ బెద్దయొట్టు!

చారు—మనకుఁ బ్రియము! ప్రియము!

విదూ—(జనాంతికముగా) ఏమయ్యా! ఇది యెక్కడనుండి వచ్చినదియని యడుగుచున్నాఁడవు.

చారు— ఏమిదోషమున్నది?

విదూ—(చేటి చెవిలో)— (ఎక్కడనారికేళని)

చేటి—(విదూషకుని చెవిలో)— (శర్విలకుఁడు దెచ్చెనని)

చారు—ఏమి యిట్లు మీరు మాటలాడుకొనుచున్నారు? మేము వెలపలివారమా?

విదూ—(చారుదత్తుని చెవిలో)— (శర్విలకుఁ డిచ్చెనఁట)

చారు—ఓసీ! ఆసువర్ణభాండమే యిదిసుమా!

చేటి—కాకేమయ్యా!

చారు—నాతోఁ జెప్పిన మేలిమాట లెన్నఁడును నిష్ఫలముగాలేదు, కావున నిందుకై యీయుంగరమును బారితోషికముగాఁ గైకొమ్ము! (అని యిచ్చి చిన్నపోయిన చేయిచూచుకొని సిగ్గుచూపుచున్నాఁడు)

వసం—(తనలో) ఇందుచేతనే యీయనపై మరులుగొంటిని.

చారు—(జనాంతికముగా) అయ్యో! ఇక్కట్టుగదా!

క॥ ధనమేడు నరుఁడు మొదటనె। జనియింపఁడయేని పుడమి సఫలత నొందున్।
బని కక్కఱపడలేని యా।తని కోపప్రసదనములు దాల్పవు ఫలమున్॥

క॥ తెక్కలుడిసిన పక్కియు। నిక్కమునకు నెండుచెట్టు, నీరొట్టిన చె।
ర్వు, కొక్కఱలేని పామును,। జక్కంగాఁ బేదవాని సాటికిఁ దగెడున్॥

మరియు,

ఉ॥ చూడఁ దరిద్రుఁ డెప్పుడును శూన్యగృహంబున కీడుజోడగున్।
మోడగు బ్రాఁకుతోడ సరిపోలుఁ దగుం జెలొట్టు నూతికిం।
బోఁడిమి దక్కియుండునెడ మున్నటి చన్వరి సంగమంబొడం।
గూడఁ దలంపుఁ జొచ్చి యెదఁ గోతెడు వేళలు దప్పిగొల్పునే?॥

విదూ—(తనలో) అతిమాత్రసంతాపము చాలు! (పైకి పరిహాసముతో)— అమ్మా! నాకొక్క స్నానశాటిక సమర్పించుకొందు!

వసం— అయ్యా! చారుదత్తుఁడుగారూ! ఇట్లు రత్నావళితో నందులఁ దూగింపఁదగదుసుండీ!

చారు—(సవిలక్షస్మితముగా) వసంతసేనా! చూడు! చూడు!

క॥ ఎవనికి భూతార్థ శ్ర।ద్ధవతి? గనిందుల నమర్చు తలఁపెల్లరకుం।
దవిలెడు, నీలోకంబున। జనచచ్చిన పేదఱికము శంకలుదేదే?॥

విదూ—చేటీ! నీవిచటనే నిదురి చెదా!

చేటి—(నవ్వి) ఏమయ్యా! మైత్రేయ! నీ బోసినోటితనము హెచ్చైన ట్లున్న దిప్పుడు?

విదూ—ఓయీ! వయస్యా! సుఖోపవిష్టులగు జనులఁజూచి కన్నుగుట్టి తిరిగి విడఁ బ్రోక్కనేమొ గదా పెద్దపెద్ద జలధారలతో నిండుగా పర్జన్యుఁడు ప్రవేశించుచున్నాఁడు!

చారు— చక్కఁగ వాక్రుచ్చితివోయి!

ఆ॥వె॥ బురదవెడలు తూండ్ల మొనసూదులట్టులు।
వచ్చి జలదమధ్య వానకాళ్ళు।
దిగెడుఁ జంద్రుఁబాసి దివి చోటచోట రాల్చు।
నశ్రుధారలనఁగ నవిఁగోకంచు!॥

మరియు,

ఉ॥ చిత్రముచూడు మార్యజన చిత్త సునిర్మల వారిధార ది।
గ్ధాత్రఖిదేలిమార్జున దృఢప్రహార ప్రతిచండగాఁగరం।
జాత్రముతో హలాయుధ పటాభములై స్రవియించు మేఘముల్।
ధాత్రిని శక్రమాత్తిక నిధానమునంతయుఁ గ్రుమ్మరించెడుల్॥

ప్రియురాలా! చూడు! చూడు! కాంతు ననురక్తవతెనే,

ఉ॥ చెచ్చెఱ మేనఁబూసికొని చిక్కని చీఁకటివన్నె పుబ్బులన్।
మచ్చులు చల్లుచున్ వలచు మాపటిగాడ్పులు వీవఁ జల్లఁగా।
నిచ్చఁదలంచి యంబుదము లెచ్చినవేళకు వచ్చి ప్రేమతోఁ।
గ్రుచ్చి కవుంగిలించుకొనెఁ గూరిమి మింటిని మెర్పుపెందమిన్!॥

వసం— (శృంగారభావమున నటియించుచుఁ జారుదత్తు నాలింగనము చేసికొనుచున్నది)

చారు—(స్పర్శసుఖ మభినయించుచుఁ బ్రత్యాలింగన మిచ్చుచున్నాఁడు)

క॥ ఉలియుము గంభీరంబుగ, జలదా! నీపసదనమున స్మరపీడ మెయిం।
గలఁగిన మెయి గగ్గురుపడి। మొలవఁ గరాగఁబు కడిమిపువుగతి నలరెన్॥

విదూ— ఓరీ! దాసీపుత్రా! దర్దినా! అనార్యా! ఈమెను మెఱుపులతో బెదరించుచు నిప్పుడు వచ్చితివేమిరా!

చారు—వయస్యా! ఇట్లుదూషింపఁ దగఁదగదుసూ!

క॥ శతవర్షము దర్దినమై।
తతధారలు గురియనీ! శతహ్రదపాడని!

అతిదుర్లభ సనుబోటికి।

సతత పరిష్వంగ మొసంగెం జాలుసునాకుఁ!॥

మరియుఁ జూడుమా! ఎంతటిధన్యుఁడనో!

క॥ వానకు వలువ దడియఁగా।

మేనెంతయుఁ జల్లబడ సమీహిత బుద్ధిం।

దానుగ నింటికివచ్చిన।

మానిని మెయిసేర్చి కవియు మనుగడవలదే?॥

ప్రియురాలా! వసంతసేనా!

తే.గీ॥ వేదికలతాళ్ళు సడలంగ బాఁదవాన।

కంబములపయి విరిసి మేల్కట్టు లూఁగు।

జారు సున్నపుఁ బూఁతతో సలిలపూర।

భరముమైఁ గ్రుస్సె నిదిగొ చిత్తరువుగోడ!॥

(మీఁదఁజూచి) ఆహా! ఇంద్రధనుస్సా?—ఓసీ! ప్రియురాలా! చూడు!

క॥ మెఱుముల నాల్కలుసాఁచుచుఁ।

దెఱగంటిఱేనివిల్లు తెగువబుజములై।

మెఱయఁగ మబ్బులదొడలు।

దెఱచుచుఁ గడునావలించె దివి చోద్యముగా!॥

కనుక లోనికేగెదము రమ్మీ! (అని లేచి నడుచుచున్నాఁడు) కలికిరో! కనవే!

మదనరేఖ॥ ధారల్ డిగ్గెడుఁగంటే। తారంటై కడుఁదాళిఁ।

భూరుట్టుండున మంద్రం।బై రాతుంబయి బాతఁ॥

మదనవిలసితము॥ సలిలమునను జిం।దుఱుగని చటులతఁ।

విలసిలుచును వీ।ణలసురి లయరా॥

(ఇంతట నందఱు నిష్క్రమించిరి.)

గద్యము॥ ఇది శ్రీమదిష్టదేవతా వరప్రసాదాసాదిత కవితా వనితా ధురంధర సౌజన్యబంధు రాపస్తంబసూత్ర పవిత్ర త్ర్యార్షేయ హారితగోత్ర సమస్తమండల తోష్టూయమాన వావిలాలాహ్వయ త్రిలింగజ వైదికాన్వయ కమలాకర ప్రభాకరాయమాణ శ్రీ మహాలక్ష్మీ సదాప్పయ్యశాస్త్రీశ్వర ద్వితీయపుత్ర సకలగురుజన సదాశీఃపాత్ర వాసుదేవశాస్త్రిచే ననూదితంబగు మృచ్ఛకటికమునం దుర్దినమను పంచమాంకము ముగిసెను.— వా.వాసుదేవశాస్త్రి. [సశేషము.]

ప్రభావతీప్రద్యుమ్నము, పంచమాశ్వాసము. (౪౬౨-పుట శేషము.)

ఉ॥ నీవిపు డింతపేరలుక నెట్టుకొనన్ ధరియించియున్కి నా
కోవనజాక్షి మందపవనౌషధినాయకముఖ్యు లుగ్రతా
పావహులౌట చిత్రమె నిజాత్మయనంగుఁడు నొంచుచున్న వాఁ
డేవిధిఁ బ్రేమపాత్రుఁ గినియించినవారికి శత్రువాత్మయన్ ౧౩౪
సీ॥ ఆనవిడువు మచ్చటికి నేనరుగుదెంచి। యలుకతీర్చెదఁ గావేని జలజహస్తి
యానవిడువు మిచ్చటికి నీవరుగుదెంచి। నీదు మధురంపుమోవి తేనియలు నాకు.
వ॥ అని యంతకంతకుఁ జెరిఁగెడు పరిరంభ రాగతత్పరవశంబున. ౧౩౬.
ఉ॥ రాగదె యోసుధాంశుముఖి రాగదె యోకరినోన్నతస్తనీ
రాగదె యోవిలాసవతి రాగదె యోకలకంఠభాషిణీ
రాగదె యోకళావిదుషి రాగదె యోకలహంసగామినీ
రాగదె యోగుణైకనిధి రాగదె యోలలితాంగి డగ్గఱన్. ౧౩౭.
క॥ కలికీ రాగదె చిలుకల। కొలికీ రాగదె లతాంత కోదండుని ప్రా
ములికీ రాగదె యూరకె। యలికీ రార్చుటుల నేల యేచెదునన్నున్ ౧౩౮
వ॥ అని వేడుకొనుచున్నంతం బట్టణంబులోనం దనవిడిదివాకిటం బ్రాభోదికంబులైన వాద్యస్వనంబులు వినంబడుటయు వజ్రనాభుపడవాళ్ళు పిలువవచ్చువేళ యయ్యెఁ గావలయు నింతటం బోకయున్నఁ గార్యంబు తప్పుననుచు లేచి యాత్మకల్పిత భూవివరద్వారంబునకై చనియెనప్పుడు. ౧౩౯.
క॥ వెఱపించఁబోయి వెఱచిన। తెఱఁగునఁ దా వేఁడుకొనఁ బతిన్వెనుకొనియెం
దెఱవ తనయల్క కడుఁ గీ।డ్పఱచి విజృంభించు విరహ పరితాపమునేన్ ౧౪౦
క॥ తన రమణి యిట్లు తను వెను।కొనుట యెఱుంగఁడు మురారికొడుకప్పుడు ప్రయో
జన వశతఁ జనియె నతిరయ।మున నాత్మనివాసమునకు భూవివరమునన్. ౧౪౧.
క॥ ఆవనితయు వడివడిని బి।లావధిగా నరిగి యంత నవ్వలనరుగం
గా వెఱచి తిరిగివచ్చెను। భావము గలఁగంగ విభునిపానుపు కడకున్. ౧౪౨.
వ॥ అట్లు వచ్చి ౧౪౩
చ॥ తనవిభు పాదసంగతిని ధన్యములైన సువర్ణ పాదుకల్
చనుఁగవ నొత్తుకొంచు మఱిశయ్యను *రాలిన తద్విలిప్త చం
దన లవముల్ శరీరమునఁ దాల్చుచుఁ దత్పరిభుక్తముక్త మా
ల్య నికరమక్షియుగ్మమున నద్దుచు నించుకసేపు రంజిలెన్ ౧౪౪
చ॥ తదనుభవోదిత శ్రుతికతంబున నవ్విభురామణీ యకా।
భ్యుదయము చర్చసేయు సురతోత్సవ చాతురియెంచుఁ బ్రేమసం

పద గణియించు లాలనల భంగులు భావననిల్పు మిక్కిలిక్
హృదయమునందు రాగిలుచు నింద్రవిరోధి తనూజ మాటికిన్. ౧౪౫.
ఉ॥ ఆక్కట యిట్టి వల్లభుని యందుచు గోపముపుట్ట నాకుఁ ద
ప్పొక్కటి యెంతొఁచె నదియుక్ మఱి మద్రతిఁగూర్చి యుంటఁగా
దక్కఁగఁ జెప్ప వల్లభుఁడు దానికి నర్థము నప్పుడెను పె
ల్లొక్కటిగాఁ దలంచి విడనాల్లన కోపము దైవవంచనక్. ౧౪౬.
ఉ॥ ఆయనఘుండు దాఁ దొలుత నంపిన పత్రికలోననున్న య
త్యాయత రాగభంగు లరయంగ ననన్యసమానభాగ్య గా
నాయది చూడ నాదయిన యల్క యమూలము కాక యున్న నా
నాయకుఁ డట్లు ప్రార్థనమొనర్పఁగ నేపిన కున్కి యొప్పునే. ౧౪౭.
క॥ మగవాఁడు తుమ్మెదయు సరి। జగతి నదియుఁగాక నేఁటి చాటోక్తుల ప్రే
మ గురుత్వము నలపత్రిక।యు గణింపఁగ నతనియందు నౌదవు నెతప్పల్. ౧౪౮.
వ॥ అని విరహవేదనం బొరలుచుండఁ బ్రభాతంబగుటయుఁ బ్రభావతి తన గృహ
దేవతయుంబోలెఁ బూజలందుచు ననన్య విదితగుప్తంబైయున్న యాపత్రికం
బుచ్చుకొని శృంగారంపుఁదోఁటలోనికిం జని యొక్క వివిక్తస్థలంబునం గూర్చుండి
మున్ను రాగవల్లరి చదువఁగామిగిలిన పత్రికాభాగంబు తనచేత నటమున్ను
బహువారపఠితంబయ్యు నవోత్కంఠఁగలుగం జేయుచుండ నల్పస్వరంబునఁ దన
లో నిట్లని చదువందొడంగె. ౧౪౯.
ద్విరదగతిరగడ॥ ఓహంసి నీచేతనున్నయది నాబ్రదుకు
నాహృదయ మింతిడెందము నేకముగ నదుకు
కరుణనిది పదివేలు కమ్మలుగఁ గైకొనుము
పరగ సతితోడ నాపలుకుగా నిట్లనుము
విద్యున్నిభాంగిరో వినుము నీకృపగన్నఁ
బ్రద్యుమ్నుఁ డనుపేరు ఫలితమగు నాకెన్నఁ
ద్రైలోక్యనిత్య సామ్రాజ్యపై భవమైనఁ
బోలదొక లేశమును బోలఁతినీకృపలోన
గరిమనెల్లెడల నీ కనుసన్నలోవత్తు
హరిమధ్య యేబాసయైన దీనికినిత్తు
నేణాక్షి వినునీయుపేక్ష నాచెవిఁబడినఁ
బ్రాణము హరించు విరు లావార్తవెంబడిన

నీ మోవి చిగురుతేనియలు గ్రోలెడియాస
నీ మొలకనవ్వు వెన్నెల చలువగొనునాస
నీ మృదు కపోలసన్నిధిని మోమిడు నాస
నీ మోహనశ్రోణి నిమురఁగలిగెడు నాస
నీదు పాలిండ్ల నానెడు వక్షము నాస
నీదు శృంగారకళ నెలవులంటెడి యాస
నీదు మణితామృతము నింతుఁ జెవిననునాస
నీదు లలితోరువు ల్నెమ్మినొత్తెడియాస
నాడలిలోఁ బ్రాణవాయువులు నకిందాఁక
వెడలకుండఁగ నిట్లు విన్నవించెదఁగాక
యీ కమ్మ పూఁదోఁట యీ తేనియలజల్లు
నీ కోమలపుగాడ్పు లీవెన్నెలబయళ్లు
తను వైదుపాళ్లు నింతక పంచిలోఁ గొనవె
యనయంబు నివి విరహికపకారు లనవినవె
నిండుచందురుఁడు నీనెమ్మొగంబు సుహృత్తు
గండుఁగోయిల గణిలి కలభాషలకుఁదొత్తు
మెఱుఁగుఁదీఁగెలు నీదు మృదుతనూలతయట్లు
కఱకుఁ బాయప్రుఁజేంట్లు కచభరశ్రీబంట్లు
కెంజిగురుచాయ నీకెమ్మోవికిని దాసి
కెంజవైభవము కన్గవకు నంతేవాసి
యివియెల్ల నాకింపు లిలనీవు చేపట్టు
నివియె పెనుమృత్యువులొకింత నీపెడపెట్ట
నని తన్నుఁగూర్చి వేనాఁడుట చెవిఁజొనుపు
వనిత యేమనియె నదిప్రాసి వేగమెయనుపు
మోరాజహంసి నీయుల్లమెందు నహేతు
కారుణ్యమని గట్టిగాఁగ నారసియోతు
నని చదువుకొన వినియె కటమున్న యేతెంచి
వెనుకనుండి తదీయవిభుఁ డాత్మహర్షించి. ౧౫౦.

వ॥ ప్రభావతియు నిట్లు లేఖచదువుకొని తదర్థంబు మఱియుమఱియు భావంబునం
బరామర్శింపుచు. ౧౫౧.

మ॥ ఇవి యాదింగల ప్రేమభంగులిఁక నా యొత్తెంచు యత్నంబు న
ట్టివిధి న్నన్నుఁ బరిగ్రహించుట నిరూఢిన్నేఁటి దాఁకన్ రతో
త్సవ సౌహార్దరతుల్ శతోత్తరత మించం జల్పుటాభవ్య ప్రా
భవరూపాది గుణవ్రజంబరయ నా భాగ్యంబె భాగ్యంబులన్ ౧౫౨
క॥ ఈరాత్రి యకారణపు । బేరలుకఁ బదత్త కైతని పిగపీకగు చా
ప్పారయ భాగ్యవిహీనలు । లేరెవ్వరు నవనిమండలిన్ననుఁ బోలన్ ౧౫౩.
వ॥ అని చింతింపుచుండ ౧౫౪
గీ॥ రాగవల్లరి యంత నారమణికడకు । నరుగుదెంచి యాసఖివెన్న నచలవృత్తిఁ
బూఁచియున్నట్టి ప్రస్యమ్ముఁ గాంచియతని । యఖిసంజ్ఞచేఁ గానని యట్లయు డెం.
వ॥ తదనంతరంబ యాయంబుజాక్షి చందం బభివీక్షించి ౧౫౬.
చ॥ పనిదలి నేఁడిదేమి ముఖపాండిమయున్నది మీఱి ప్రత్యహః
క్రియలఁ బరాకుమాన్చినది కృష్ణచతుర్దశినాఁటి చంద్రరే
ఖయుబలె మేనుచిక్కినది కాటుకకప్పదె యొప్పెడుం గుచ
ద్వయుఁ బికరాజి క్రమ్మేతఁగయు వ్రాలెను సోలెను చల్లగాడ్పులన్. ౧౫౭
ఉ॥ లోలతరాక్షి యాపనుఁటలోనిది యొక్కడిలేఖ యల్లనాఁ
డేలిక యంపినట్టిదియొ యెయ్యదియైనను సిగ్గులేలనేఁ
డా లిఖితార్థ మేమయిన నట్టిటు గెంటినఁ జూచెదేమొయాఁ
బోలిక చూడనట్లు యధిపుల్సతులందుచు సత్యసంధులే ౧౫౮
క॥ అని నడు నడుమఁ బ్రస్త్యాన్ముని వదనముఁ జూచినగుచు ముద్దియుతల్లో
చనసంజ్ఞా ప్రేరణమున । దనుజేశ్వర సుతకుమతియుఁ దానిట్లనియెన్ ౧౫౯.
క॥ ఈరేయి రమణుఁడెంతయు । గారించిన వాఁడునిన్న గట్టిగఁ దెలసెన్
నారీమణి మానుసమదిఁ । గూరిమిదాఁచుకొని యలుగఁగూడదు నీకున్. ౧౬౦.
క॥ నీవలిగెడుదాఁకను లే । దో వనితా యాటమాని వడ్డించుకొనం
గావలసె విభునియలుకల । చే విరహాకులితవై కృశించితి విదిగో ౧౬౧
ఉ॥ తానటు లల్కఁ దెచ్చుకొని ధైర్యబలంబున రాకతక్క నీ
వైన వియోగతాప మృతితాకృతిచూడఁగ నప్పుడిష్ట మో
మానిని తాను నోర్వఁ దతమాత్రవియుక్తికి నిష్టమాన్చు నీ
కా నెఱనాణయోగ్య కరుణామృత వృష్టి నయోగఖేదమున్ ౧౬౨
వ॥ అనిన రాగవల్లరికిఁ బ్రభావతి యిట్లనియె. ౧౬౩.
సీ॥ అట్టి యసత్యంపుటలుకలు గల్పించుకొని వియోగవ్యథఁ గుందఁజేసి
కాంతలయారూపు గనుఁగొను వేడ్క లేలాగుండుఁ దోఁచినిర్దయులయందు

సంభావించునా కాని సత్కృపారాశి మత్ప్రియేశుఁ డేవినోదమున నైన।
తనుఁజిన్నపుచ్చి కన్గొనఁజాలఁ డొకని మేపార్థమాత్రంబు నోయంబుజాక్షి
నేఁటిరాత్రి తెఱంగు నానేరమున జనించె నదియొక్క మాటకే నెమ్మనమున
నలిగితేరన యేనెన్ని ప్రార్థనములఁ దానిచే నెంత చెడసెనో ధవుని మనము.

చ॥ అనవిని రాగవల్లరి సమంకురితస్మిత కోమలావలో
కనముల నాప్రభావతిని గన్గొనునట్లు తటీశ్వరుం గనుం
గొని బళిగోపపుత్ర రసికుండవు నీదగు ధౌర్త్య మింతిపై
ఘనమను మా నవీన సుధ గాంచి చవుల్గొను కోర్కి కోర్కియే ౧౬౫

క॥ నావిని యోసి తుటారి ద। యావారిధి నధిపుఁగూర్చి యనకు మొకటియున్
నా వెఱ్ఱితనుక యింతకుఁ। దావలమని చెప్పవినవె తరుణీయనియెన్. ౧౬౬.

వ॥ అని యో రాగవల్లరీ నీవు నాకు బహిఃప్రాణంబవుగాని సఖీమాత్రంబవు గావు
నీకు దాపతంబు సేయనేల మా తెఱంగు వినిపించెద వినుమని తనకోపనిమిత్తం
బును బ్రియుండు తనతోడన రాకుండ నానపెట్టి తాను శయ్యాంతరంబున కరు
గుటయు మొదలుకొని ప్రియునిర్గమ పర్యంతంబుగాఁ దమవృత్తాంతంబు సకలం
బునుం జెప్పఁదగిన ప్రకారంబునం జెప్పి యిట్లనియె. ౧౬౭.

క॥ కాంతుండాగతి నాయ। త్యంత కఠోరతకు నాత్మయందు విఱిగియో
యింతయగు విరహదశ కుప। శాంతి యరసికొననో లేచిచనియెం జెలుచన్. ౧౬౮

క॥ తఱినంత వేఁడుకొనవిన। నెఱుఁగని నానిష్ఠురతకు నేడువిఱుగుల
స్వాఱిగనాకా ప్రియునిచిత్తము। విఱుఁగకయున్నం ద్యజించి వెసనేలచనున్. ౧౬౯

ఉ॥ క్రీడకు మానసంపదకు వెల్తిగదా యొదియుంచు నెంచకేఁ
గూడఁగఁ బాఱి పట్టుటకు గొబ్బుననప్పుడ సాహసించితిన్
జేడియ దాపనేరకిది చెప్పెదఁ బ్రాణము నీవుగావునన్
గూడఁగలేకయింతఁ గడుఁగుందితి ఘోరవియోగవేదనన్. ౧౭౦.

ఉ॥ ఆపరిపాటికంతఁ గడునల్గుమ నట్టిఱిభున్ దథావిధా
లాపవిచిత్రతం దురపిలంగ వియోగ దవాసహత్వమున్
జూపుచుఁ జేరవేఁడు వివశుం గయికోక కఠోరవృత్తిఁ బె
న్పాపముఁగట్టుకొన్న గతభాగ్యకు నాకివి పాల్పెనే చెలీ. ౧౭౧.

సీ॥ సెఱపకేలున్నవి నెత్తలిరీటెలు తమవాఁడియెల్ల నా తనువుమీఁదఁ
బఱపకేలున్నవి పరభృతశ్రేణులు శ్రుతులలోఁ దమపల్కు సూదులెల్ల
నుఱుపకేలున్నవి నెఱయ ధైర్యంబును గందంపుమలకోడె గాడ్పుగములు

విటుపకేళులున్నవి వెసనంటఁబోదివి వపుర్మహోశఁ బరాగ మూర్ఛరములౌ
నన్నొక ఘూమిలోపల నాతిగాఁగఁ। దలఁచి పేచంప కిట్లోర్వు, జాల్చినవియో
తెగితెగని విటు గత్తికోఁతగ వధించు। టుచితమని యోలి నిల్లిప్రచున్నయవియొ.

చ॥ అనివిరహంపుఁ జేరలఁత నాశ్రితచంద్ర శిలాతలంబు మీఁ
ద నొరుగుచుఁ సఖిందిగిచెం దవ్విశిరోదిశకై తదంకముం
దనకుఁదలాడగాఁ గొనఁగఁ దజ్ఞతబోటియుఁ దత్క్రియా ప్రవ
ర్తనకుఁ దదీశు దాకొలిపి తాఁ దనయింటికిఁబోయె నవ్వుచున్. ౧౭౩.

గీ॥ ప్రాణసఖియిట్లు పన్నిన పన్నుగడలు। తెలియమినిఁజేసి యపుడు వైదేయకన్య
తనకునంకోపధానమ ట్లనువుపఱిచి। యాలతాంగియ యున్నది యనుతలఁపున.

ఉ॥ ప్రాణసఖీ నిను న్నెరయఁబాసిచనన్ దఱివచ్చె నాకుఁ గ
ల్యాణి తలంప్రమీ సుసమయంబుల నన్నని ప్రేమ పెంపునన్
బాణి మెడందగిల్చి తనపైకిఁ దదాస్యము వంపఁబూని సు
శ్రోణి నిజేశు మోముగుట చూచి త్రపాన్విత మోదమగ్నతన్ ౧౭౪.

క॥ ఒక్కింతతడవు చేష్టలు। దక్క కనంబడియెఁ జిత్రతనువును బోలెన్
మిక్కిలిఁ గమనీయతసతి। దక్క కురుస్తంభ సంగతత్వము కతనన్. ౧౭౫.

వ॥ అప్పుడు ప్రభావతికిఁ బ్రద్యుమ్నుండిట్లనియె ౧౭౬

చ॥ వెఱఁగుపడంగనేల యలివేణి భవత్పతిఁగానె యేను నీ
విరసత మాన్పలేకపుడు వేఁగుచు సంతటిలోఁ బ్రయోజనాం
తరమతినేగి నేఁటికిని దాని ప్రసంగము లేమి వచ్చితిన్
దిరిగి వసించితి న్వెనుకదిక్కున నీవిధమెల్లఁ జూచుచున్. ౧౭౭.

చ॥ అని యిరుకేలఁ గ్రిందటిగ నాసతి బాహులుపట్టి యెత్తి పె
న్వెనుకకు రా వెసందిగిచి పేదుకనంక కృతోపవేశఁ జే
సె నెరులుదువ్వెఁ జెక్కటను జెక్కిలిచేర్చెను మోవిచుంబనం
బొనరిచెఁ జన్నులంటెఁ గరయుగ్మము ప్రక్కలఁబాఱఁ జొన్పుచున్. ౧౭౮.

మ॥ సుముఖీయెన్నఁడు నింక నల్గనను మంచు న్మొక్కిపట్టె న్నఖా
గ్రములన్ దంతశిఖన్ గుచాధరము లాకాంతుండు తత్కాంతయున్
సుముఖాయెన్నఁడు నల్గఁజేయ ననుమంచు న్మోవితానట్లు నా
క్కి మనోనాథు వరిష్వక్షస్థురః కుచక్లిష్టాంగుఁ జేసెం దుదన్. ౧౮౦.

చ॥ అలుకయొకింతకాలము మహత్తర సేతుపురీతి నాగి భే
దిలితోలఁగన్ సహస్రముఖ తీవ్రతచూపెను దొంటికంటె వా

రల యసమానమానిత పరస్పర కేళిరసప్రవాహ మ
గ్గలికఁ దదుత్తరంగ రతికర్మవిచిత్రతఁ జెప్పశక్యమే. ౧౮౧.

వ॥ ఇవ్విధంబునఁ బ్రద్యుమ్నుండు ప్రభావతిం గూడి బహుకాలంబు యథేష్టభోగంబు లనుభవించుచు నప్పటప్పటికి వజ్రనాభుని నపూర్వవర్తన ప్రవర్తనంబుల వశవర్తిం జేసికొనుచుఁ బ్రవర్తిల్లె గదసాంబులును జంద్రవతీ గుణవతులతోడఁ గూడి రాత్రులెల్ల రమియించుచు నాట్యసమయంబులఁ బ్రద్యుమ్నునకు విదూషక పారిపార్శ్వకాది కృత్యంబుల సహాయత్వంబు నడపుచు దైత్యవిభుని చిత్తంబు వడసి రంత. ౧౮౨.

చ॥ రమణదలిర్పఁగా బుతువు రాకలు దక్కె నొడళ్ళు బిక్కె చి
ట్టుము లుదయించె వేవిళు లనూనతమించెఁ గపోలసీమఁ బాం
డిమ గనుపట్టెఁ జన్మొనల నీలిమ పుట్టె వలగ్నముం గురు
త్వము బొరసెన్ వళుల్విరిసె దానవకన్యలకుం గ్రమంబునన్. ౧౮౩.

క॥ నవమాసాంతరమున। బ్రవిమల శుభదినమునం బ్రభావతి గాంచెన్
శివ గుహుని గాంచు కైవడి। నవనిఁ బ్రభావంతుఁ డనఁగ నమరెడుతనయున్.

క॥ ప్రణుతగుణ చంద్రవతి దివామణినిభుఁ జంద్రప్రభుం గుమారునిఁ గాంచెన్
గుణవతియుఁ గాంచె నిరుపుర। గుణవంతుం గీర్తిమంతుఁ గోర్కులు పొదలన్.

వ॥ ఇట్లు గాంచిన కుమారు లుదయింపుచుం దోడన పరిపూర్ణ యౌవనులును సకల వేదవేదాంగ పారగులును ధనుర్విద్యాసంపన్నులు నగుచుం గన్యాంతఃపురంబునఁ బ్రవర్తిల్లుచున్నంత నొక్కనాఁడు తత్రత్యాధికారులవలన వారలయునికి నిశ్చితంబుగా విని వజ్రనాభుం డాగ్రహోదగ్రుం డగుచుఁ దనసభాసదులఁ గలయం గనుంగొని. ౧౮౪.

ఉ॥ కంటిరె కాలవక్రత ప్రకారము దానవముఖ్యులార నా
యింటికి ద్రోహముం దలఁచి యిష్టసుఖాప్తికి ముచ్చులిట్లు నూ
ల్కొంటు దలంప శేషఫణి కోఱల వ్రేలిడి గోఁకుకోఁగ ము
క్కంటితి వెలుంగు కంటఁ జణకింబులు చేఁచుకొనంగఁ బూనరే. ౧౮౫.

గీ॥ వాండ్రు సురవంశభవులైన స్వర్గమునకుఁ। బ్రళయసమయ మిప్పుడు నాగకులజులైన
నాశకాలంబు తద్భువనమునకిదియ। నరులయిన నంత్యదశ నేఁడె ధరణికెల్ల. ౧౮౬

గీ॥ ప్రాణములతోడ నిటవాండ్రఁ బట్టితెచ్చి। తెలిసి తల్లోకమును గడతేర్పవలయు
నిపుడని పట్టితెమ్మని నిజపురంబు। పెద్దతలవరిఁ దాఁ బంచె భీమబలుని. ౧౮౭.

సీ॥ వాఁడుచని తిరుగకయున్న వరుసదంత। నాయకోత్తములను దళవాయిఁ ఖనిచె
వారుఁ దిరుగకుండినఁ దదవస్థఁదెలిపె। నరులు కోటకొమ్ములఁ గట్టినట్టితలలు

వ॥ వజ్రనాభుండు తా నత్యంత కోపాటోప దీపితముఖుండగుచుఁ దన తమ్ముఁడు సునాభుండును సకల మిత్రామాత్య వర్గంబులును రథతురంగ మాతంగ పదాతి వ్రాత పాదఘాతంబులచేత భూతలంబు వడవడ వడంక నత్యుత్సాహంబునం జెచ్చికొలువ నలువుమిగిలి కన్యకాభవన ప్రాకారంబు చుట్టుముట్టుకొనియె నప్పుడు తమ విడుదులనున్న ప్రద్యుమ్న గదసాంబులు మనమింతట నంతఃపుర ప్రవేశంబు సేయక తడసిన నీదైత్యపురరక్షకుని యక్కజంపువిక్రమంబు కుమారులకు నూర్వ్యశక్యంబుగాదని పూర్వవిహిత మహీవివరద్వారంబున నాక్షణ బ్రవేశించి భీతివశంబున నొక్కచోటనే చేరియున్న తమ కళత్రంబుల యుత్తల పాటు దీర్చి తత్పూర్వకృత్త దైత్యగాత్రంబుల నెత్తుటం దోఁతిల్లిన యాయుధంబులు తమచేతులనయుండ సంభ్రమంబునం జనుదెంచి మ్రొక్కియున్న కుమారుల సంశ్లాఘావచనంబుల నలరించి రక్తిమెడఁ బ్రద్యుమ్నుండు ప్రభావతిం జూచి యిట్లనియె. ౧౯౧

సీ॥ మగువవినుము మిగులఁ దెగివిక్రమింపమీ। తండ్రికడలివచ్చె దర్పమెసఁగ
మనకువచ్చుఁ గడుఁబ్రమాదమేమింతట। యుద్ధమునకుఁ దెగకయూరకున్న. ౧౯౨

క॥ కుడుముల క్రోళ్లాటలుగా। వుడురాజానన రణంబు లూహించిన వెం
బడి రావేమటుతోడరినఁ। దాడిబడ నెవ్వాఁడు బిట్టుగ్రుంగునా మాచేన్. ౧౯౩

ఉ॥ చేడియ నీమనంబునకుఁ జింతయొకింత జనించెనేని నేఁ
జూడఁగఁజాల నీజనకుచొప్పదలంప హతుండుగాక తాఁ
గీడు చలంబుమానఁ డనికింజొర కొండొకత్రోవ క్రొక్కఁగా
గూడదు యేమిసేయుదును ఘోరవిచారముపుట్టె నాత్మలోన్ ౧౯౪.

చ॥ అని తనుఁగూర్చి దానవకులాగ్రణిపైఁ దెగతేని చింత సే
యు నధిపుఁ గోట లగ్గలకు నుగ్రతఁ దగ్గని భూరిసైన్యుఁ దం
డ్రినిఁ బరికించి యింతివిభునిం దమిఁ గాచికొనంగ వేఱత్రో
వ నెనకి కానకంతఁ బితృవత్సలభావముఁ బాఱఁజూచుచున్ ౧౯౫.

క॥ తానచని మాఁనున్న యు।మానన తదీయాసిఁదెచ్చి యొసఁగి గెలువుమీ
దానవపతిఁ దక్కిన యను।మానము మానుమని పలికె మానవతి పతిన్. ౧౯౬

[సశేషము]

ఆంధ్రకవులచరిత్రము, మధ్యకవులు. (౪౧౮-పుట శేషము.)

—— ౦ ——

రామరాజభూషణుఁడు-

రామరాజభూషణుఁడు వసుచరిత్రమను శృంగారప్రబంధమును రచియించిన మహాకవి రామరాజభూషణుఁడనునది రామరాజుయొక్క యాస్థానమందుండుట చేత వచ్చిన బిరుదనామమనియు నిజమయినపేరు భట్టుమూర్తియనియు చెప్పుదురు ఇతనిజన్మభూమి బట్టుపల్లెయను గ్రామము ఈగ్రామమును కృష్ణదేవరాయలు కవిత్వమునందుఁ బ్రవీణులై ప్రబంధాంకమువారని బిరుదొందిన యీతని పూర్వులగు బట్టురాజులకిచ్చెను ఈ బట్టుపల్లె బళ్ళారిమండలములోని పాలమండలమునకు సమీపమున నున్నదని యొకరును, కడపమండలములోని పులివెందల తాలూకాలో నున్నదని యొకరును, వ్రాసియున్నారు ఈకవి కృష్ణదేవరాయల కాలములోఁ బుట్టియుండవచ్చును గాని యాతని యాస్థానమునందలి యష్టదిగ్గజము లనఁబడు కవులలో నొకఁడుమాత్రము కాఁడు. ఇతఁడు మొట్టమొదట ౧౫౪౨వ సంవత్సరము మొదలుకొని ౧౫౬౫వ సంవత్సరము వఱకును సదాశివరాయలపేర విజయనగరములో రాజ్యముచేసిన కృష్ణదేవరాయల యల్లుఁడయిన రామరాజుయొక్క యంతిమదశలో నతని యాస్థానమునందుఁ బ్రవేశించి యాతనిమీఁదఁ గొన్ని చాటు ప్రబంధములను జేసి రామరాజభూషణుఁడని బిరుదుపేరొందెను కాఁబట్టి యీతని కవిత్వము ౧౫౫౦వ సంవత్సర ప్రాంతములయందు నారంభమయినదని చెప్పవచ్చును. ఈతఁడు రామరాజుయొక్క జీవితకాలములోనే యాతనిమీఁద కృతులు చెప్పినట్టు వసుచరిత్ర కృతినాయకుఁడయిన తిరుమలదేవరాయలు కవినిగూర్చి పలికిన యీక్రింది పద్యమువలనఁ దెలియవచ్చుచున్నది —

శా॥ శ్రీరామ క్షితిపు న్మదగ్రజు జయశ్రీలోలు నానాకళా
పారీణుఁ బహుసంస్కృతాంధ్రకృతులం బల్కుచు మెప్పించి త
త్కారుణ్యంబున రత్నహార హయవేదండాగ్రహారాది స
త్కారంబందితి రామభూషణకవీ ధన్యుండవీవన్నిటన్ —ఆ. ౧

ఈపద్యమునందుఁ జెప్పఁబడినతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడైన యారవీటి రామరాజు. కృష్ణదేవరాయని యల్లుఁడయినందున నీతని నళియరామరాజని సాధారణముగా వాడుటకలదు. ఈతఁడు కృష్ణదేవరాయని యల్లుఁడయి సదాశివరాయని రాజ్యభారమును వహించినసంగతి రామాభ్యుదయములోని యవతారికయం దీక్రింది పద్యమునఁ జెప్పఁబడినది —

ఉ॥ ఆపటుకీర్తి రామవసుధాధిప చంద్రుఁడు కృష్ణరాయ ధా
త్రీపతి సార్వభౌమ దుహితృప్రియుఁడై వితతప్రతాప సం
తాపిత శత్రుఁడై యుల సదాశివరాయ నిరంతరాయ వి
ద్యాపురరాజ్యలక్ష్మికి నిధానము దానయి మించె నెంతయున్.

ఈ రామరాజు వివాహము చేసికొన్న కృష్ణదేవరాయని కూఁతురి పేరు తిరుమలాంబ ఆమెవలన నీతనికి కృష్ణరాజు, పెదతిమ్మరాజు, అని యిద్దఱు పుత్త్రులు గలిగిరి. ఈ సంగతి నరపతివిజయమనం ద్విపదకావ్యములోఁ జెప్పఁబడినది —

గీ॥ అనఘుఁడౌ వైరసేని భీమాధిపేంద్రు
పట్టి దమయంతిఁ జేపట్టినట్టి రీతి
రామభూపాలకుఁడు కృష్ణరాయ తనయ
యగు తిరుమలాంబ నుద్వాహమయ్యె వేడ్క.

వ॥ శతముఖుఁడుం బులోమజను శంకరుఁడుం గిరిపుత్త్రి శంబరా
హితురతిఁ జెలిఁబోలుచు నహీనసుఖాయి భవాప్తి రామభూ
పతియును దిర్మలాంబయును భానుసమానునిఁ గృష్ణసాహ్వయాం
చితగుణుఁ బెద్దతిమ్మనృపశేఖరుఁ గాంచిరి హర్షముప్పొంగఁగన్.

రామరాజుయొక్క యనంతరమున మాతామహార్జితమయిన విద్యానగరరాజ్యమునకు రావలసినవాఁడు కృష్ణరాయని దౌహిత్త్రుఁడయిన కృష్ణరాజేయయినను, రామరాజు తమ్ములయిన తిరుమలదేవరాయలును వేంకటపతిరాయలును బలవంతులయి యాతనికి దక్కనియ్యక యారాజ్యమును తామే యాక్రమించుకొని యేలసాగిరి.

మూర్తియనియు రామరాజభూషణుఁడనియు నిద్దఱు వేఱువేఱు కవులనియు నందు మూర్తికవి నరసభూపాలీయమును రామరాజభూషణకవి వసుచరిత్ర హరిశ్చంద్ర నలోపాఖ్యానములను రచియించిరనియు కొందఱును, ఇద్దఱు నొక్కరే యనియు మూర్తియనునది నిజమయిన పేరనియు రామరాజభూషణుఁడన్నది రామరాజుయొక్క సభ కలంకారముగా నుండుటచేత వచ్చినబిరుదుపేరనియు నతఁడు సూరపరాజున కౌరసపుత్త్రుఁడయి తదగ్రజుఁడయిన వేంకటరాయభూషణునకు స్వీకృతపుత్త్రుఁడనియు మఱికొందఱును, జెప్పుచున్నారు. "శ్రీరామచంద్ర చరణారవింద వందన పవననందన ప్రసాద సమాసాదిత సంస్కృతాంధ్రభాషాసామ్రాజ్య సర్వంకష చతుర్విధ కవితా నిర్వాహక సాహిత్య రసపోషణ రామరాజ భూషణ ప్రణీతం"బని వసుచరిత్రములోని గద్య మొకవిధముగాను "శ్రీ హనుమత్ప్రసాద లబ్ధకవితాసార సారస్వతాలంకార నిరంకుశ ప్రతిభాబంధుర ప్రబంధ పఠనరచనా ధురంధర ప్రబంధాంక వేంకటరాయభూషణ సుపుత్త్ర తిమ్మరాజపౌత్త్ర సకలభాషా విశేష నిరుపమావధాన శారదామూర్తి మూర్తిప్రణీతం"బని నరసభూపాలీయములోని గద్య మింకొకవిధముగాను నుండుటనుబట్టియు, హరిశ్చంద్ర నలోపాఖ్యానములో "ప్రబంధాంక సింగరాజ తిమ్మరాజ ప్రియతనూజ ధీర సూరపాత్మజుఁడు రామనృపభూషణాఖ్య సుకవి"యనియు నరసభూపాలీయములో "ప్రబంధాంకసింగరాజసుత తిమ్మరాజపుత్త్ర ప్రసిద్ధసరస వేంకటరాయభూషణ సుపుత్త్రు నను బుధ విధేయు శుభమూర్తినామధేయు"ననియు తండ్రులను వేఱువేఱుగాఁ జెప్పుటనుబట్టియు, వారు వేఱువేఱుకవులయినట్టు పయికిఁ గానవచ్చుచున్నను గొన్ని హేతువులనుబట్టి రెండవపక్షమువారు చెప్పెడియంశములుకూడ సావధానముగా విచారింపవలసి

నవిగా నున్నవి ఉభయపక్షములవారును జెప్పెడుయుక్తులను జక్కఁగా గ్రహింపఁగలుగుటకయి వంశక్రమమును జెప్పెడు పూర్వోక్తములయిన రెండు పద్యములను పూర్ణముగా నిందుదాహరించుట యావశ్యకమని తోఁచి యట్లు చేయుచున్నాను మొట్టమొదటఁ బుస్తకములను జదివినప్పు డిరువురు కవులును వేఱువేఱనియే నేనును నభిప్రాయపడినను రెండవవారి యుక్తులను విన్నపిమ్మట నామనస్సునకుఁ గొంత సందేహము కలిగినందున, ఏతన్నిర్ణయమును దీనిని జదువువారికే విడిచిపెట్టి గ్రంథ సౌలభ్యమునిమిత్త మిందుభయుల నొక్కరినిగానే భావించి వ్రాసెదను ఇరువురును భిన్నులయినను కాకపోయినను చరిత్రభాగమునందు వేఱువేఱుగా వ్రాయవలసిన యంశము లేవియుఁ గానఁబడవు

౧. సీ॥ శతలేఖినీపద్య సంధాన ధౌరేయ ఘటికాశతగ్రంథ కరణధుర్య
నాశుప్రబంధ బంధాభిజ్ఞ సోష్ఠ్య నిరోష్ఠ్యజ్ఞ నచలజిహ్వోక్తినిపుణుఁ
దత్సమభాషావితానజ్ఞు బహుపద్యసాధిత వ్యస్తాక్షరీధురీణు
నేకసంధోచితశ్లోక భాషాకృత్యచతురు సోష్ఠ్యనిరోష్ఠ్యసంకరజ్ఞు
నమిత యమకాశు ధీప్రబంధాంక సింగ
రాజసుత తిమ్మరాజ పుత్త్రప్రసిద్ధు
సరస వేంకటరాయభూషణ సుపుత్త్రు
నను బుధవిధేయు శుభమూర్తి నామధేయు.—నరసభూపాలీయము.

౨. సీ॥ వనధిలంఘనకృపా వర్ధితోభయ కవితాకళారత్న రత్నాకరుండ
సకలకర్ణాట రక్షాధురంధర రామవిభుదత్త శుభచిహ్నవిభవయుతుఁడ
వసుచరిత్రాది కావ్యప్రీతబహునృప ప్రాపితానేక రత్నప్లవుండ
శాశ్వత శ్రీ వేంకటేశ్వరానుగ్రహ నిరుపాధికైశ్వర్య నిత్యయశుఁడ
శ్రీకర మహాప్రబంధాంక సింగరాజ
తిమ్మరాజప్రియతనూజ ధీరసూర
పౌత్త్రుఁడ రామనృపభూషణాఖ్య సుకవి
నంకిత మొనర్తు నీకావ్య మనఘభక్తి —హరిశ్చంద్రనలోపాఖ్యానము.

మ॥ నను శ్రీరామ పదారవిందభజనానందున్ జగత్ప్రాణనం
దన కారుణ్యకటాక్ష లబ్ధకవితా ధారాసుధారాశి సం
జనితైకైక దినప్రబంధ ఘటికాసద్యశ్శతగ్రంథ క
ల్పను సంగీతకళారహస్యనిధిఁ బిల్వంబంచి పల్కెం గృపన్ —వసుచరిత్ర.

పయిపద్యములలో నుపయోగింపఁబడిన విశేషణములు కొన్ని భిన్నములుగా నున్నను పరస్పర విరుద్ధములయిన వేవియు లేనందున వానినిబట్టి గ్రంథకర్తలు భిన్నులని సాధించుట కాధారమేదియు లేదు. రెండు గ్రంథములను జేసినవా రాంజనేయ ప్రసాదలబ్ధకవిత్వవైభవులమని వ్రాసికొనుటచేతను, రెండుకవిత్వములు నేకరీతినే యుండుటచేతను, ఆదినుండియు నిప్పటివఱకును బట్టుమూర్తియే వసుచరిత్రము రచియించెనని జనశ్రుతి వచ్చుచుండుటచేతను, కవికిఁదరువాత నల్పకాలములోనే

వసుచరిత్రమునకు వ్యాఖ్యానము చేసినవారుకొందఱు బట్టుమూర్తితానురచియించిన నానారసభాసురమగు ప్రబంధమునందలి వివిధాలంకారములకు లక్షణగ్రంథముగ నుండునట్లు నరసభూపాలీయమను నలంకారగ్రంథమును రచియించెనని వ్రాసియుండుటచేతను, తద్గ్రంథత్రయకర్తయొక్కఁడే యయియుండునేమోయని యెట్టివారికిని సందేహము కలుగకమానదు. ఇఁక పైపద్యములలోని యంశములనుబట్టి విచారింపవలెను. నరసభూపాలీయకృతికర్తపేరందలి గద్యమునుబట్టిమూర్తియనుట స్పష్టము. దానికి బట్టుమొదలయిన పదములనువేనిని జేర్చినను, అవి కులనామములో బిరుదునామములో యయియుండును. కావ్యాలంకారసంగ్రహమనఁబడెడు నరసభూపాలీయములోని పూర్వోదాహృతమయినపద్యములో "శుభమూర్తినామధేయు" నని 'శుభ' విశేషణమొకటి కానఁబడుచున్నది. ఈశుభవిశేషణ మెట్లువచ్చినది, ఎవ్వరికిఁ జెందునది, అన్న విషయము నాలోచింపవలయును. పూర్వోదాహృతమయిన హరిశ్చంద్రనలోపాఖ్యానములోని పద్యములో రామభూషణకవి "రామవిభుదత్త శుభచిహ్న విభవయుతుఁడ" నని వ్రాసికొనియున్నాఁడు. కాఁబట్టి దీనినిబట్టిచూడఁగా శుభబిరుదమును రామరాజిచ్చెననియు, రామరాజభూషణనామముగలవానికది చెందుననియు, విస్పష్టమగుచున్నది. నరసభూపాలీయ కృతికర్త తనకు శుభవిశేషణమును వేసికొనుటయు, హరిశ్చంద్రనలోపాఖ్యానకృతికర్త తనకు రామరాజు శుభచిహ్నమిచ్చెనని చెప్పుకొనుటయు, ఈ రెంటినిగూర్చి చిరకాలమునుండి పరంపరగా వచ్చుచున్న జనప్రతీతితోఁ జేర్చి విచారించినపక్షమున నా రెండుగ్రంథములనురచించినవారొక్కరేయని చూపుటకది యొకప్రబలసాక్ష్యముగాఁ గనఁబడుచున్నది. రామరాజభూషణపదము బిరుదనామమే యయినపక్షమున, పయిపుస్తకములయందలి నామవ్యత్యాసములనుబట్టి కవులువేఱనిచెప్పుట కవకాశముండదు. రామరాజభూషణపదము బిరుదుపేరుగాక పేరేయయి యుండినయెడల నదియంతట నేకరూపముగానుండునే కాని పైపద్యగద్యములందున్నట్లొకచోట "రామరాజభూషణ"యనియు, ఇంకొకచోట "రామభూషణ" యనియు, వేఱొకచోట "రామనృపభూషణ"యనియు నొకయుక్తిచెప్పుదురుగాని యది యంతప్రబలయుక్తి కాదు. కట్టకడపటఁ జేసిన హరిశ్చంద్రనలోపాఖ్యానములో "వసుచరిత్రాదికావ్య" "బహునృపప్రాపితానేకరత్న" పదములనుప్రయోగించుటచే నాదిపదప్రయోగము చేత రెంటికినడుమ నతఁడుచేసిన కావ్యమింకొకటి యుండవలసినందున నదియే నరసభూపాలీయమనియు, బహుపదప్రయోగము చేత నిద్దఱికంటె నెక్కువరాజు లుండవలసినందున వారే రామరాజు తిరుమలరాజు నరసరాజుననియు, మూఁడు గ్రంథములను రచించినవాఁ డొక్కఁడేయనుట కింకొకయుక్తిని జెప్పుచున్నారు. ఈయుక్తి యెంతయాదరణీయమో బుద్ధిమంతులు తమలోఁదామ నిర్ణయించుకొనవలెను. ఈకవి తన జనకపితను పాలకపితనుగూడ సంతోషపెట్టుటకయి యొకపుస్తకమునందు కన్నతండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునందు పెంచుకొన్నతండ్రిపేరు వేసెననియు, ఒకపుస్తకమునందెవ్వరిపేరును వేయక విడిచెననియుఁ జెప్పుచు,

ఆయా పుస్తకములయం దుపయోగింపఁబడిన పదము లేయొకఁడు జనకపితయనియు నొకఁడు పాలకపితయనియు సూచించుచున్నవని చెప్పుచున్నారు. హరిశ్చంద్ర నలోపాఖ్యానములోని "సూరపాత్మజుఁడ"నను వాక్యమువలన సూరపరాజున కౌరసుఁడని యాత్మజశబ్దము దృఢపఱుచుచున్నదనియు, నరసభూపాలీయములోని "వేంకటరాయభూషణ సుపుత్రు"నను వచనమువలన వేంకటరాయభూషణునకు దత్తుఁడని సుపుత్రశబ్దము దృఢపఱుచుచున్నదనియు, వాదించుచున్నారు. ఈ యర్థములయం దాత్మజశబ్దమునకుఁ దనవలనఁ బుట్టినవాఁడే కాని దత్తుఁడు కాఁడనియు, సుపుత్రశబ్దమునకు పున్నామనరకమునుండి రక్షించు దత్తుఁడే కాని కన్నవాఁడు కాఁడనియు, గ్రహింపవలెను. ఈ యంశముల కనుకూలములుగా నుండు కథలు కొన్ని కలవుగాని గ్రంథవిస్తారభీతిచే వానిని విడుచుచున్నాను.

ఈ రామభూషణకవి మొట్టమొదట రచియించిన కావ్యము వసుచరిత్రము. ఈ ప్రబంధముతో సరిరాఁదగిన శ్లేషకావ్యము తెనుఁగున మఱియొకటి లేదు. ఇందలి వర్ణనలు మిక్కిలి మనోహరములయియున్నవి, పదములకూర్పు మిక్కిలి సుందరముగా నున్నది, శబ్దార్థాలంకారము లాహ్లాదకరముగా నున్నవి, రసభావాదులు యథాయోగ్యములుగా నున్నవి. ఈ గ్రంథము రచియింపఁబడినతరువాత నేఁటివఱకును ప్రబంధములను జేయఁబూనిన కవులెల్లను వసుచరిత్రమునే ప్రతిరూపమునుగాఁ జేకొని దాని ననుసరించి తమగ్రంథములను రచియించుచున్నారు. ఈ వసుచరిత్రము హూణశకము ౧౫౭౦వ సంవత్సరమునకుఁ దరువాతనే రచియింపఁబడినది. వసుచరిత్ర కృతిపతియైన తిరుమలదేవరాయఁడు ౧౫౬౭వ సంవత్సరమునందు తన రాజధానిని పెనుగొండకు మార్చెను. ఈతఁడు పెనుగొండను రాజధానిగాఁ జేసి కొన్నతరువాత మహమ్మదీయులతో జరగిన యుద్ధవార్త వసుచరిత్రములోని యీ పద్యమునందుఁ జెప్పఁబడియున్నది.—

చ॥ తిరుమలరాయశేఖరుని ధీరచమూభటరాజి యాజి భీ
కరయవనేశ్వరప్రహితఖానబలంబులఁ జక్కుసేయ ని
ద్ధరఁ బెనుగొండకొండలు మదద్విపచర్మకపాలమాలికా
పరికరభూషితంబులయి బల్విడిఁ గాంచె గిరీశభావమున్.

తిరుమలదేవరాయలు తన జ్యేష్ఠపుత్రుఁడయిన రఘునాథరాజు మృతుఁడయినతరువాత ద్వితీయపుత్రుఁడయిన శ్రీరంగరాజును యువరాజును జేసి రాజ్యభారము నాతని మీఁద మోపినకథగూడ సూచనగా నీపుస్తకమునందుఁ జెప్పఁబడియున్నది —

చ॥ హరిపదభక్తిశీలుఁడగు నా రఘునాథనృపాలుకూర్మి సో
దరుఁడు సిరంగరాయవసుధావరుఁ డాత్మగుణప్రమోద వ
త్తిరుమలరాయశేఖర వితీర్ణమహాయువరాజపట్ట బం
ధురుఁడయి సర్వభూభువనధూర్వహశక్తి వహించు నెంతయున్.

తిరుమలదేవరాయఁ డవసానదశలో తన రాజ్యభారము నంతయు కొడుకులమీఁద వదలివేసిన తరువాత మూఁడవ కొడుకగు వేంకటపతిరాజు ఆలీ అడిల్ షాతో

యుద్ధము చేసి పరాజితుఁడయి ౧౫౭౭వ సంవత్సరమునందు రాజధానిని పెనుగొండ నుండి చంద్రగిరికి మరల మార్చెను. వేంకటపతిరాయఁ డీపోయినసంగతిని జెప్పక పోయినను కవి వసుచరిత్రములోని యీక్రిందిపద్యములో వేంకటపతి రాజధానిని చంద్రగిరికి మార్చినసంగతి సూచించియున్నాఁడు —

మ॥ హరుఁడా తారకశైలశృంగమున నధ్యాసీనుఁడై రాజశే
ఖరవిఖ్యాతివహించుఁ జంద్రగిరి దుర్గంబందు శ్రీవేంకటే
శ్వరుఁడొప్పెన్ బహురాజశేఖర సదాసంసేవ్యుఁడై యారయ
న్ధరబంధేలికనాసి తద్గిరులకున్ దద్వల్లభశ్రీలకున్.

ఈపద్యములన్నిటినిబట్టి చూడఁగా వసుచరిత్రము ౧౫౭౭వ సంవత్సరమునకుఁ దరువాతనే ముగింపఁబడినట్టు స్పష్టమగుచున్నది. తిరుమలదేవరాయఁ డేసంవత్సరము నందు మృతినొందెనో స్పష్టముగాఁ దెలియదుగాని ౧౫౭౨వ సంవత్సరమువఱకును నాతఁడిచ్చిన దానశాసనములు కనఁబడుచున్నవి; ౧౫౭౨వ సంవత్సరము మొదలు కొని ౧౫౮౫వ సంవత్సరమువఱకును ఆతని రెండవ కొడుకయిన శ్రీరంగరాజు దానశాసనములును, ౧౫౮౫వ సంవత్సరము మొదలుకొని ౧౬౧౪వ సంవత్సరము వఱకును మూఁడవకొడుకయిన వేంకటపతియొక్క దానశాసనములును, కాన వచ్చుచున్నవి. తిరుమలదేవరాయఁడు ౧౫౭౨వ సంవత్సరమునకుఁ దరువాత రాజ్య భారమునంతను పూర్ణముగా కొడుకులకప్పగించి తాను విద్వద్గోష్ఠితోఁ బ్రొద్దు పుచ్చుచుండి యుండవచ్చును. ౧౫౭౭వ సంవత్సరమునందు ఆలీఆదిల్‌షా తిరుమల దేవరాయని పెనుగొండనుండి చంద్రగిరికి పాఱఁదోలినట్టు మహమ్మదీయులు వ్రాసినచరిత్రమునందున్నది. దీనినిబట్టిచూడఁగా తిరుమలదేవరాయఁడు ౧౫౭౭వ సంవత్సరమునకుఁ దరువాతఁ గూడఁ గొంతకాలము జీవించియున్నట్టు తోఁచుచున్నది. రామరాజభూషణుఁడు తిరుమలదేవరాయనికి వసుచరిత్రము నంకితము చేయునప్పుడు తెనాలి రామకృష్ణుఁ డక్కడకు వచ్చి "శ్రీభూపుత్రి" యని మొదటి పద్యమును జదువనారంభింపఁగానే పకపకనవ్వి యీకృతి చదువుటతోనే శ్రీపోయెనని గేలి చేసెననియు, అదియెట్లని సభవారడుగఁగా నతఁడు చేతిలో బూడిద వేసికొని యందు శ్రీయను నక్షరమునువ్రాసి చేయి నోటిదగ్గరగాఁ బెట్టుకొని బిగ్గరగా శ్రీ భూపుత్రియని (భూ) ద్వితీయాక్షర మొత్తిచదువఁగానే యూఁగలిచేత చేతిలో వ్రాసిన శ్రీ యెగిరిపోవుట చూపెననియు, అందుమీఁద రాజుకృతినందక నిరాక రించెననియు, పనికిమాలినకథయొకటి చెప్పుదురు. ఈప్రకారముగానే రామరాజ భూషణుఁడు "నానాసూనవితానవాసన" లన్న పద్యమును నందితిమ్మన్నయొద్దను "మోహోపదేశ తమోముద్రితమతులైన" యనుపద్యము నయ్యలరాజు రామభద్రుని యొద్దనుకొని తన వసుచరిత్రమునందు వేసికొనెనని కొందఱుకొన్నికథలు కల్పించి యున్నారుగాని యవియన్నియు నవిశ్వాసనీయములే. అటువంటి యుద్గ్రంథమును జేయఁగలిగిన మహాకవి రెండుసామాన్య పద్యములను జేయలేక యితరులవలన దొంగిలించి తనవిగాఁ దనగ్రంథమునందు వేసికొనెనని చెప్పుటకంటెఁ బరిహాసా

స్పదమయినమాట మఱియొకటియుండదు.

రామరాజభూషణుఁడొకనాఁడు సభలో రాజాజ్ఞమీఁద కవీశ్వరులకు "కుంజరయూథంబు దోమకుత్తుకఁజొచ్చెన్" అని సమస్యయియ్యఁగా తెనాలి రామకృష్ణుఁడు

క॥ గంజాయి త్రాగి తురకల
సంగాతముఁ గూడి కల్లు చవిగొన్నావా?
లంజెలకొడుకా! యెక్కడఁ
గుంజరయూథంబు దోమకుత్తుకఁజొచ్చెన్?

అని పూరించెననియు, అదియె రాజు తానిచ్చినట్లు భావించి పూరింపుమనియడుగఁగా

క॥ రంజన చెడి పాండవులరి
భంజనులై విరటుఁగొల్వఁ బాల్పడిరకటా!
సంజయ! విధినేమందును?
గుంజరయూథంబు దోమకుత్తుకఁజొచ్చెన్

అని పూరించెననియు, రాజాతని సమయోచితబుద్ధికి సంతోషించి బహుమానమిచ్చెననియు, చెప్పుదురు. తెనాలి రామకృష్ణుఁడు రామభూషణునియొక్క కడపటి దినములలో నున్నవాఁడగుటచేత నిది సత్యమైనను కావచ్చును.

నరసభూపాలీయము రచియించినకవి యెవ్వరయినను కృతిపతి రామరాజ తిరుమలదేవరాయలకు మేనల్లుఁడయిన నరసరాజు. ఈనరసరాజుయొక్క మాతామహుఁడయిన శ్రీరంగరాజునకు కోనరాజు, తిమ్మరాజు, రామరాజు, తిరుమలరాజు, వేంకటపతి, అని యయిదుగురు కొడుకులును, లక్కమాంబ, ఓబమాంబ, కోనమాంబ, అని ముగ్గురు కూఁతులును, ఉండిరి ఆకొమార్తెలలో లక్కమాంబ కుమారుఁడయిన నరసరాజు కావ్యాలంకారసంగ్రహమను నరసభూపాలీయమును కృతినొందెను, ఓబమాంబకుమారుఁడయిన గొబ్బూరి నరసరాజు రామాభ్యుదయమునుకృతినందెను, కోనమాంబకుమారుఁడయిన తిమ్మరాజు పరమయోగివిలాసమును రచించెను. వీనిలో నరసభూపాలీయము ప్రతాపరుద్రీయమునకు తెలుఁగు నాటక ప్రకరణమును మాత్రమువిడిచి ప్రతాపరుద్రీయములోని లక్షణభాగమునంతను కవి తెనిఁగించినను లక్ష్యములను నరసభూపాలునిపేర క్రొత్తగా రచించెను.

రామరాజభూషణుఁడు సాహిత్యమునందు మాత్రమే కాక సంగీతమునందును మిగుల ప్రావీణ్యముగలవాఁడు. ఈతఁడు రచియించిన కృతులుకొన్ని యక్కడక్కడ నేఁటివఱకును పాడఁబడుచున్నవి ఒకవేళ వసుచరిత్రములో తిరుమలదేవరాయఁడు కవినిగూర్చి "బహుసంస్కృతాంధ్రకృతులం బల్కాయి మెప్పించి" తివన్న కృతులివియెయయి యుండునేమో!

హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచించునప్పటికి రామరాజభూషణుఁడు వృద్ధుఁడయినాఁడు. అప్పటికే విద్యానగరసంస్థానమంతయు పూర్ణముగా నశించి పోయినది. పింగళిసూరనార్యుఁడు రాఘవపాండవీయమును జేసినతరువాత రామరాజ

భూషణుఁడు హరిశ్చంద్రనలోపాఖ్యానమును రచించెను. ఈరెండుగ్రంథములలోని గుణదోషము లెట్టివయిన నగు రాఘవపాండవీయమునకు వచ్చిన ప్రసిద్ధి యీగ్రంథమునకు రాలేదు. రామరాజభూషణుఁ డీద్వ్యర్థికావ్యమును శ్రీరామాంకితము చేసెను. ఈకృతి పదునాఱవ శతాబ్దాంతమునందు రచియింపఁబడినట్టు కనఁబడుచున్నది కాఁబట్టి రామరాజభూషణుఁడు ౧౫౫౦ వ సంవత్సరము మొదలుకొని ౧౫౯౦ వ సంవత్సరము వఱకును గ్రంథరచన చేయుచున్నట్లు చెప్పవచ్చును. పూర్వోక్తము లయిన మూఁడుగ్రంథములనుండియుఁ గొన్నిపద్యములనిం దుదాహరించుచున్నాను —

వసుచరిత్రము

మ॥ సతియూరుద్యుతిఁ జెందఁబూని నిజమశ్వత్థాపనోదక్రియా
రతిఁబాధోలవ పూరితోదరములై రంభాహస్తంబులు
న్నతటిన్ పీడెమరు ద్విభూతిఁ గదళి ద్వద్దోషమాచంచలో
ద్ధత శుండాతతిఁ బాయదయ్యెన దెసో తద్వైరమాలంబిలన్ — ఆ ౨

శా॥ రాజీవాత్ములనేచు పాతకివి చంద్రా! రాజవా నీవు? నీ
రాజత్వంబునఁ జక్రముల్ మనిరొనో? రంజిల్లె సత్సంతతుల్
తేజంబందెనా? డింజెనో యహిభయోద్రేకంబు? తాఁజెల్లరే!
రాజైపుట్టుట రశ్మిమాత్రఫలమే? రాజౌట దోషార్థమే? — ఆ ౪

హరిశ్చంద్రనలోపాఖ్యానము

ఉ॥ కమ్మనిపువ్వుదేనియల కాఁకలడంచు ప్రవాళతాళ వృం
తమ్ములసేదదేర్చు విరితావుల చల్వలుగ్రమ్ము మంచి పూ
పమ్ములఁబూజసల్పు ప్రతతుల్వర మంజులతాధిరాజ్యయో
గమ్మునఁ బొల్చు నాసుగుణ కల్పకవల్లివనిం జరింపఁగన్ — ఆ ౩

చ॥ కుదురు మెఱుంగు నిబ్బరపు గుబ్బలపై నయనాంబుపూరముల్
చెదరఁగ నేఁటియేడ్చెదవు చెల్వ మిరంత విషాదవేదనా
విదళిత మానసాబ్జవయి వే తగునాయువు శాశ్వతంబె సం
పదలు స్థిరంబులే విధివిపాకము దాఁటఁదరంబె యేరికిన్ — ఆ. ౫

నరసభూపాలీయము.

మ॥ బలితంబైన మనోజబాణహతిచేఁ బల్మాఱు నిల్పోపలే
కలినీలాలక ప్రాణముల్వెడలి నేత్రాంభోజ మార్గంబునన్
గలయంబ్రాఁకుచువచ్చి యన్నెలవునన్ గన్నీటిరో యడ్డమై
నిలుపన్నిల్చె నృసింహభూరమణ మన్నింపంగఁ బాఁడింతటన్ — ఆ ౨

ఉ॥ చందనశైల సానువులఁ జాలఁజెలంగు భుజంగ బాలికా
బృందము శ్రీనృసింహవిభుఁ జేర్కొని పాడఁ దదీయ గాన ని
ష్యందములాను వేడ్కఁ జెరయంగఁ గురంగతురంగ మేగమిన్
మందగతి ప్రసంగములు మానవు దక్షిణ గంధవాహముల్ — ఆ. ౫

సంఘదురాచార సంస్కరణసమాజమును దానియుద్దేశమును.

(౩౬౮ - పుట శేషము.)

ఇట్టి దుష్కార్యములకయి వారి నెంతమాత్రము నిందించిన పనిలేదు. కామ సుఖమునకయి విద్వాంసులను సహితమింద్రియవర్గమీడ్చును ఆకలములు తిని యండయును వానయుననక ఘోరాటవులయందు తపమాచరించెడు విశ్వామిత్రాది ఋషులుగూడ నెట్లు కామవికారమునకు లోఁబడిరో మనమెఱుఁగమా? అట్టిమనో బలముగల విద్వాంసులు ఋషులు మొదలగువారే కామజన్యవికారమునకు లోఁబడి నప్పుడు బాలవింతతువులుమాత్ర మెట్లు కామము నిలుపఁగలుగుదురు? ఇంటయుండి రహస్యముగా చేయు దుష్కార్యములకంటె యోగ్యుని వెదకికొని వివాహమాడుట యే యుక్తము. ఇట్టి బాలవితంతువుల సహవాస దోషముచే కులస్త్రీలుగూడ వ్యభిచ రించుచున్నారు.

వితంతువులయి బాలికలు కలకాలము తల్లిదండ్రుల యాదరణలో నుండుట వలన కొంతవఱకు వారియెడల తల్లిదండ్రులకు గౌరవముకూడ తగ్గును. దాసివలె నింట నతినీచకరములగు పనులన్నిటిని చేయుచు మాటిమాటికి ప్రతి కొద్దిలోపమునకు తల్లిదండ్రులచే తిట్లుతినుచు కాలము వెళ్ళబుచ్చుటకంటె మరణమే సుఖతరముగా నుండును తల్లిదండ్రులకు తరువాత యవనారంభమున తరగరమై దదని మహాకష్టముగా తోచి వారిని చూచినప్పుడెల్ల నతిహీనముగాఁ దలఁచుచు మాటిమాటికి తమభర్తలతో నా మెపయి నేరములను చెప్పుచుందురు. భర్తపోవుటయు, సౌఖ్యమించుకయు లేకపోవుటయు, కురూపిగాఁ జేయఁబడుటయు నుచితగౌరవము గాఁ కాలము వెళ్ళబుచ్చనేరక తినుటకును కట్టుటకునుగూడ లేక బాధపడుటయు, మాటిమాటికి తమమరదండ్ర చేతను అన్నదమ్ముల చేతను తిట్లు తినుచుండుటయును దప్ప వారి జీవితకాలమందొకరోజైనను సౌఖ్యమయినదుండదు.

స్త్రీపునర్వివాహములు చేయఁగలుగుట చేత కులస్త్రీలయందు వ్యభిచారము బొత్తుగా నుండదని నాయభిప్రాయ మెంతమాత్రము కాదు వైద్యమువల్ల అన్ని రోగములును మానుటలేదుగనుక వైద్యమే మానుకొనవలెనని చెప్పినట్టు స్త్రీపున ర్వివాహము వ్యభిచారదోషమును మొదలంట తగ్గించనేరదు గాన అట్టివివాహముల వలన ప్రయోజనమే లేదని యెంచఁగూడదు. హిందూబాలవితంతువుల దుర్దశయు, వారుపొందు కష్టములును, వారు చేయు దుష్కార్యములును ఆలోచించినచో మనుష్య మాత్రునకు వారియెడల జాలిపుట్టకుండదని నేను భావింతును ఎంతకఠినునకయినను హృదయము కరగించి బాలవితంతువుల దుర్దశనుగూర్చి విచారముపుట్టించి స్త్రీపున ర్వివాహములు అత్యావశ్యకములని బోధించుటకీవరకిందునుగూర్చి మహనీయుల వలన జేయఁబడిన యుపన్యాసములకంటె నెక్కువయావశ్యకము లేదు. ఎందరెంత

బోధించినను వారికి స్త్రీపునర్వివాహములు చేయ ధైర్యమింకను రాకున్నది స్త్రీపునర్వివాహములు కర్తవ్యములనియు, తన్ను దానముగొనినపతి చనిపోయినచో పురుషసంయోగ మొందని స్త్రీ వేదమంత్రములతోడను పురుషసంయోగ మొందిన స్త్రీ వేదమంత్రములు లేకను, ఇష్టమున్నచో తిరిగి వివాహమాడవచ్చుననియు, అట్లు పునర్వివాహము చేసికొనిన స్త్రీకిఁగలుగు సంతానము శాస్త్రీయమైనదే యనియు వేదశాస్త్రములయందుఁ జెప్పఁబడియున్నది. గ్రంథవిస్తారభీతిచే శ్రుతిస్మృతులయందలి వాక్యములనిందు వ్రాయఁబూనుకొనక నాచదువరులు సులభముగా తెలిసికొనఁగలుగుటకు శ్లోక, పుటాధ్యాయ వివరములతో గ్రంథనామములనుమాత్ర మీక్రింద నుదాహరించుచున్నాను —

౧. ఋగ్వేదము. ౧౦, ౧౮, ౮, ౯.
౨. ఐతరేయబ్రాహ్మణము 3 పుట ౬౮ (బొంబయిప్రచురము)
3. అధర్వణవేదము పుట ౨౦౪
౪. పరాశరస్మృతి, ప్రాయశ్చిత్తకాండము ౨౮ శ్లోకము.
౫. మనుస్మృతి (అధ్యా ౯-౧౭౬ శ్లోకము)

స్త్రీపునర్వివాహములను గురించి ౧౮౫౬ సంవత్సరములో రాజకీయశాసననిర్మాణసమాజమువారివలన నిర్మింపఁబడిన ౧౫వ శాసనమునుబట్టి పెనిమిటిమరణానంతరము బాలవితంతువులు మరల వివాహమాడుటకు గొన్ని బాధలు కానుపించుచున్నవి. బాలవితంతువులకు మరల వివాహమాడుటవలన జనసామాన్యమువలనఁ గలుగు కష్టములటుండఁగా న్యాయశాస్త్రమును శాసనమును బట్టియైనవారికి సంపూర్ణమయిన సంరక్షణ లేకుండుటచేత వివాహమాడుట వారికతికష్టతరముగానున్నది మతాధిపతులవలన బహిష్కారము చేయఁబడుటయు, జనులవలన నతి నీచముగాఁ జూడఁబడుటయు, తల్లిదండ్రులవలననయిన నించుకయిన నాదరణ పొందలేక పోవుటయు బాలవితంతువులనెట్లు వివాహమాడ ప్రోత్సాహపఱుపఁగలుగును? కామబాధ కోర్వఁజాలక యెన్ని కష్టములకయిన నోర్చి వివాహమాడఁబ్రయత్నించినచో మృతినొందిన యామెభర్తయొక్క ఆస్తియించుకయిన నామెకుఁ జెందక పోవుటయు, పునర్వివాహమాడిన వానికిని తనకును సంపూర్ణస్వాతంత్ర్యములు లేక శాసనసంరక్షణమించుకయినను పొందనేరక పోవుటయు, దేవస్థానములు మొదలగు ప్రదేశములకు రానీయఁబడక శూద్రులకంటె నతినీచముగాఁ జూడఁబడుటయు, బలత్కారముగా కేశములు తీయించఁబడి కురూపినులుగాఁ జేయఁబడుటయు, అన్యాయముగా మతమునుండి బహిష్కరింపఁ

బడుటయు బాలవితంతువులకు తప్పక సంభవించును శాసనసంరక్షణమించుకయినను లేకపోవుటచే సామాన్యజనులవలన కష్టములు గూడ హెచ్చుచున్నవి.

స్త్రీపునర్వివాహశాసనమునుబట్టి పునర్వివాహమాడిన స్త్రీ తన మొదటిభర్త యొక్క ఆస్తిని పోగొట్టుకొని యించుకయినను పొందనేరదు. స్త్రీపునర్వివాహము లతిహేయముగా దలచఁబడు నీరాజులలోఁ బునర్వివాహ మాడఁదలఁచిన స్త్రీలకు భాగ్యవంతులగు భర్తలుదొరకుట దుర్లభము. తన మొదటిభర్తయొక్క ఆస్తి నంతను పోగొట్టుకొని సామాన్యునొకని పునర్వివాహమాడి బీదరికమనుభవింప నెవతెకు మనసుపుట్టును? ఇంటనుండి గర్భస్రావశిశుహత్యాది మహాపాతకములు చేసి వ్యభిచరించినప్పటికి మృతినొందిన భర్తయొక్క ఆస్తికి ఆమె అర్హురాలగుట గాని స్వ[illegible]నిని పునర్వివాహమాడి సుఖించుటవలనమాత్రము అట్టిఆస్తి కర్హురాలు క నేరదట. ఇట్టికష్టములకులోనయి పునర్వివాహ మాడుటకంటె బాలవితంతువులకు వ్యభిచరించి యింటనుండుటయు లేనిచో యేజార భర్తతోగూడి తనకున్న ధనముతో నిల్లువెడలి పరదేశము పోవుటయు వారికి సుఖకరముగా నుండును తల్లిదండ్రులును తమబాలికకు పునర్వివాహము చేయవలయునను తలంపు ఎంతదృఢముగాఁ గలిగియున్నను పైకారణములచే వెనుకకు దీయుచున్నారు. శాసననిర్మాణసమాజమువారిని కోరి హిందూబాలవితంతువుల విషయమయి శాసనములను మార్చి వారికి సంపూర్ణసంరక్షణ మొసగునట్లు చేయవలయును. ప్రస్తుతపు స్త్రీపునర్వివాహ శాసనముయొక్క కాఠిన్యముతగ్గించి వివాహమాడిన సామాన్య స్త్రీలకువలెనే బాలవితంతువులకును సంపూర్ణమగు స్వాతంత్ర్యము నొసఁగునట్లు దొరతనమువారిని మనము కోరవలయును.

ఈయంశమునుగూర్చి పలువురు భిన్నాభిప్రాయులుగా నున్నారు. సంఘదురాచారసంస్కరణ విషయమయి దొరతనమువారి మార్పులు మనము కోరఁదగదనియు, మనమే యత్నించి సంస్కరించుకొనవలయునుగాని దొరతనము వారిని ప్రతి స్వల్పవిషయమునకును శాసనము లేర్పరచునట్లుకోరఁదగదనియు చెప్పుచున్నారు. ఇందువిషయమయి వారి యభిప్రాయములను చర్చించుట నాకావశ్యకము కాదు. శాసనములలో పునర్వివాహమాడిన వారికి స్వాతంత్ర్యము లేనిచో మనమెంత వారి నాదరించినను తుదకు సంపూర్ణ స్వాతంత్ర్యములను వారుపొందనేరరు.

కాఁబట్టి దేశక్షేమముఁ గోరు ప్రతిమనుష్యుఁడును స్త్రీపునర్వివాహములను గూర్చి సకలవిధములచేతను పాటుపడి ప్రోత్సాహపరుపవలయును. బాలవితంతువులకు బలాత్కారముగా వారి సమ్మతినొందక మొదలంట కేశములను దీయించు

దుష్టాచారము మాన్పవలయును. దొరతనమువారిని కోరి శాసనము మార్పించుట విషయమయి అందలి యావశ్యకము జనులకు బోధపరచి బాలవితంతువులకు సంపూర్ణ స్వాతంత్ర్యము లొసఁగ యత్నింపవలయును దేశాభిమానులందరును వెనుకదీయక యిందునుగురించి సాధ్యమగువఱకు ప్రయత్నించవలయునని కోరుచున్నాను. ఇట్టిగొప్పయంశమునుగురించి పూర్ణముగా చర్చింపడలపెట్టుటవలనను వ్రాయ బూనుకొనుటవలనను నాయసమర్థత్వమే ప్రకటమయి చర్విత చర్వణముగా దోచునుగాన నింతటితో విరమించి ముందు అంశమును గురించి వ్రాసెదను. సంపూర్ణ సామర్థ్యముగల మహనీయులనేకులవలన ననేకవిధముల నుపన్యాసము లీయఁబడి పూర్ణముగా చర్చింపఁబడిన యంశమునుగురించి వ్రాయఁబూనుట వ్యర్థ ప్రయత్నమేయియినను బాలవితంతువుల దుర్దశనుజూడనోపక స్త్రీ పునర్వివాహముల వలని లాభములను కొంతవఱకు తెలియఁజేయవలయునను నుత్సాహముతో దీనిని వ్రాయఁబూనితిని.

చతుర్వర్ణములలోనుకలిసి భోజనప్రతిభోజనములుచేయు పలు విధములగు శాఖలవారు తమలోదాము వివాహమాడుటనుగురించి యోచింతము

మనమేపనినైనను జేయునప్పు డందువలన గలుగు లాభనష్టములను జక్కగాఁ జర్చించియే చేయవలయును. ఏకార్యమునైనను జేయుట కందువలన గలుగు లాభము మనకుముందుగా తెలియవలయును, అట్లు లాభప్రాప్తి లేక పోయినచో నట్టికార్యమును జేయుటకే మనముపూనుకొనము. హిందువులలోఁగల చతుర్వర్ణములలోను పలు విధములగు శాఖాసంఘములుండుట మనమెఱిఁగియే యున్నాము. ఏవర్ణమునందుఁగల శాఖలవారు ఆవర్ణమునందే శాఖాభేదము లేక వివాహమాడుట యుచితమా? అను నంశమునుగూర్చి యిప్పు డాలోచించుచున్నారము ఇట్లు శాఖాభేదము లేక వివాహమాడుటవలన గలుగులాభములును నష్టములును జక్కగా చర్చించి, చిరకాలమునుండియుండిన యీ యాచారమును భేదించుటకు శాస్త్రములుఒప్పునా? యని యోచించవలయును. ఆచారభేదములు జనులు కలుగఁజేసికొనినవిగాని భగవంతుని యుద్దేశమువలనఁ గలిగినవికావు. జనులు తమసౌఖ్యముకొఱ కప్పుడప్పుడేర్పఱుచుకొనిన నిబంధనలే యాచారములు. అట్టియాచారములను అవసరము గలిగినప్పుడెల్ల మనపూర్వులుమార్చుకొనుచు వచ్చి నట్టు లనేక నిదర్శనము లగుపడుచున్నవి ఒకకాలమునందు సుఖకరముగానుండు నాచారములు మఱియొక కాలమునందు కష్టతరములుగా నుండవచ్చును. ఒకప్పుడు లాభకరములుగానుండినవి మఱియొకప్పుడు నష్టదాయకములు గానుండవచ్చును. ఈ

శాఖాభేదములను మనపూర్వులేర్పరచిన కాలమునందీయాచారములు లాభకరములుగా నేయుండి యుండవచ్చును మనపూర్వులీశాఖాభేదములను మంచి యుద్దేశముతో నేర్పఱచినారా? లేదా? యను సంశయముతో మనకంతగా నిప్పుడవసరము లేదు ఇప్పుడట్టి మార్పు అవసరమా? కాదా? అను సంశయమును, అట్టి మార్పు గలుగఁజేయుటవలన లాభము గలుగునా? నష్టము గలుగునా? యను సంశయమును, మాత్రమే మనమాలోచించవలయును.

ఈశాఖాభేదములను గుఱించి చెప్పఁబోవుటకు ముందు మనపూర్వుల ఆచార వ్యవహార పద్ధతులను గురించియు, చతుర్వర్ణభేదమును గురించియు, నీ శాఖలను గురించియు, నీశాఖలను గురించియు కొంత చెప్పవలయును. భగవంతుడు మనుష్యులనిన్ని భేదములుగా సృజయించి యిట్టి శాఖాభేదములతో నుండవలెనని యెన్నటికిని యుద్దేశించియుండఁడని కొంచెముదూర మాలోచించినవారి కెల్ల దెలియకపోదు జాతి మత ద్వేషమూలములు గలిగి చిరకాలమునుండి పెఱిగి దేశమంతట వ్యాపించియున్న యీ దురాచారవిషవృక్షముయొక్కయాచారశాఖలిట్లు వృద్ధియగుచుండవలెననియు, పరస్పర విరోధములతో దేశమంతట నిండియుండవలెననియు భగవంతుని యుద్దేశమెన్నటికిని కాదు

ఈశాఖాభేదములెప్పుడెప్పుడెట్లు గలిగెనో కొంచెము యోచింతము. మన శాస్త్రములయందును, శృతి, స్మృతులయందు నీశాఖాభేదములను గురించి యెచ్చటను చెప్పియుండలేదు, కావున ఆయా శాస్త్రములును, శృతి, స్మృతులును పుట్టినకాలములయందీశాఖాభేదములు బొత్తుగా లేనే లేవు. వేదములయందు వర్ణభేదమునుగురించి చెప్పబడియున్నను, పేరునకుమాత్రమే వర్ణభేదముండినట్లు కానుపించుచున్నదిగాని భోజనప్రతిభోజనములు, వివాహసంబంధములును లేక పరస్పర విరోధాతిశయముతో నిండియుండినట్లెచ్చటను గానుపించదు.

హిందువులందఱును చాలభాగము ఆర్యుల సంతతివారగుటయు, ఆర్యులు మొదట వింధ్యోత్తరప్రదేశములయందు నివసించియుండుటయు మన మందరము నెఱిఁగియున్న యంశమే. ఆర్యులావింధ్యోత్తర ప్రదేశములయందుండిన పూర్వ కాలమునందు వారిలో జాతి, మతభేదములును యేమియు లేవు వేదములు ఈ కాలమునందే పుట్టినట్టు తోఁచుచున్నది అంతట కొంతకాలమునకు వారి సంఖ్య హెచ్చను, హెచ్చను, తాము మొదట నివసించియుండిన విధ్యోత్తరదేశము చాలక వారు వింధ్యపర్వతములను దాటి క్రమక్రమముగా దేశమంతటను వ్యాపించి తాము జయించుచువచ్చిన దేశములయందు నివసించిరి. మనువు కాలమువఱకును వీరిలో

వర్ణవ్యత్యాసముగాని మతభేదముగాని యేమియుండినట్లు కానుపించదు.

తరువాత మనువు రాచకార్యములకును, రాజ్యపరిపాలనకును, చట్టములనేర్పఱచినప్పుడు కార్యనిర్వాహముకొఱకప్పటిజనులను నాలుగువర్ణములుగా విభజించెను. ఇట్లు జనులను నాలుగువర్ణములుగా విభజించుటయతని ముఖ్యోద్దేశము వృత్తులు కల్పించి కార్యములను జక్కగా నిర్వర్తింపఁ జేయుటకేకాని, భోజన ప్రతిభోజనములు లేకను, వివాహసంబంధములు లేకను జాతిమతద్వేషముతో పోరాడుచుండుటకు నెంతమాత్రమును గాదు. మనువు కాలమునందును, తరువాత చాలకాలము వఱకును పేరునకుమాత్ర మట్టివర్ణభేదములున్నను, వివాహ సంబంధములు చేసికొనుటకును, భోజనప్రతిభోజనములు చేయుటకు అభ్యంతరముండినట్లెంతమాత్రము కానుపించదు. చాలకాలమయినతరువాత ఆయావర్ణములవారు తమ తమ వర్ణములవారితోడనేగాని యితరులతో సంబంధములను మానుకొనిరి.

ఆర్యులు మొదటనివసించియుండిన వింధ్యోత్తరప్రదేశమును వదలి, వింధ్యపర్వతములను దాటి క్రమక్రమముగా నొకదేశముతరువాత నొకదేశమును జయించి అట్లు జయించిన దేశములయందు తాము నివసించుచువచ్చిరని పైనే వ్రాసియున్నాను. అట్లు తాము నివసించిన దేశమును బట్టి ఆ చతుర్వర్ణములవారికిని, మైథిలులనియు, ఉత్కలులనియు, మహారాష్ట్రులనియు, ఘూర్జరులనియు, ద్రావిడులనియు, మొదలయిన దేశనామములు గలిగినవి. దేశభేదమును బట్టి ఆచారవ్యవహారములు భేదించుటచేతను, అన్యదేశీయులలోని జాతిమతభేదములు తెలియకపోవుటచేతను, పూర్వకాలమునం దొకదేశమునుండి మఱియొక దేశమునకు ప్రయాణసదుపాయము బొత్తిగా లేకపోవుటచేతను, ఏదేశమువా రాదేశమువారితోడనేగాని యితర దేశీయులతో సంబంధములను మానుకొనిరి. ఏదేశమునం దుండినను, బ్రాహ్మణులు బ్రాహ్మణులుగానే యుండినను, వర్ణభేదము నిశ్చయముగా తెలియకపోవుటచే నొక దేశములోని బ్రాహ్మణులు మఱియొక దేశములోని బ్రాహ్మణులతో సంబంధములు మానుకొనిరి. ఇట్లు దేశభేదమువలన బుట్టి వివాహసంబంధము పోయిన తెగలతో ద్రావిడులను, గౌడులను మన మెఱుగుదుము.

ఇట్లు ప్రతిదేశమువారియందును, ఆచారభేదమును బట్టి కొన్నియు, భాషాభేదమును బట్టి కొన్నియు శాఖలు పుట్టినవి. ఈశాఖలలో నేశాఖవా రాశాఖవారితోడనేగాని యితరశాఖవారితో నానాటికి బొత్తుగా సంబంధములు మానుకొనిరి. ఈశాఖలలో చాల శాఖలు కలిసి భోజన ప్రతిభోజనములు చేసినను వివాహములు మాత్రము బొత్తుగా మానుకొనిరి.

భాషాభేదమునుబట్టి గలిగిన శాఖలలో అరవలు, తెలుగువారు, కర్ణాటకము వారు మొదలైనవి అనేకములు గలవు మఱియు నాయాశాఖలలో నాచారభేదమును బట్టియు, సూత్రభేదమునుబట్టియు అరవబ్రాహ్మణులయందు బోద్ధాయనులు, వడమలు, అష్టసహస్రమువారు మొదలైన తెగలును తెలుఁగు బ్రాహ్మణులయందు ఆశ్వలాయనులు, ఆపస్తంబులు మొదలైన తెగలును గలిగినవి ఈరీతినే ద్రావిడులలోని అన్ని శాఖలవారియందును, గౌడులలోని అన్ని శాఖలవారియందును కొన్నికొన్ని భేదములు కలుగుచువచ్చినవి. ద్రావిడులును, గౌడులును భోజనప్రతిభోజనములు మానుకొనినను ఆయాతెగలయందలివారు తమయందుఁగల పలువిధములగు శాఖాభేదములను గణియింపక భోజన ప్రతిభోజనములుమాత్రము చేయుచు వివాహసంబంధములు మానుకొనిరి.

ఇంతేకాక కొంతకాలమునకు శంకరాచార్యుఁడు, మధ్వాచార్యుఁడు రామానుజాచార్యుఁడు మొదలైన మతగురువులు బయలువెడలి తమతమమతములనుజనులకు బోధించుచు వచ్చుటచే ప్రతితెగవారియందును అద్వైతులు, ద్వైతులు, విశిష్టాద్వైతులు, మొదలగు మతములవారు కలిగిరి ఏకదేశీయులయ్యును, ఒక్కశాఖవారేయయినను ఒకసూత్రమువారే యయినను ఆయామతములవారికి పూర్వకాలమునందుగల ద్వేషములనుబట్టి యొకమతమువారితో మఱియొక మతమువారు వివాహసంబంధములును భోజన ప్రతిభోజనములును మానుకొనిరి. మతోద్ధారకుల యుద్దేశమిదికాకపోయినను, మతము నమ్మకము ననుసరించినదిమాత్రమే యయినను జాతిమతద్వేషము నానాటికి విరోధములను హెచ్చుచేయుచువచ్చి మఱికొన్ని తెగలుగా జనులను భేదించుచు వచ్చినవి.

మఱియు బ్రాహ్మణులలో రాచకార్యసంబంధమునుబట్టి పూర్వము హిందూ రాజులకు మంత్రులుగానుండి రాజ్యతంత్రములను నిర్వర్తింపుచువచ్చినవారి తెగ యొకటియు, మంత్రులుగానుండక వేదశాస్త్రములను చదివికర్మలను నిర్వర్తించుచు వచ్చినవారి తెగయొకటియు పుట్టి, మొదటి తెగవారు నియోగులనియు, రెండవ తెగవారు వైదికులనియు చెప్పఁబడుచువచ్చిరి బ్రాహ్మణులయందీరెండు తెగలును పుట్టుటకనేకులు అనేకములగు కారణములను చెప్పుదురు. అవియన్నియు మనప్రస్తుతాంశమున కంతగా నవసరములేనందున నిందు వ్రాయఁబూనుకొనలేదు ఈరెండు తెగలును పుట్టుటకు కారణము అంతగా విశేషమయినదికాకపోయినను వీరు వివాహసంబంధములను బొత్తుగా మానుకొనిరి. ఈనియోగి, వైదికి తెగలు కృష్ణాగోదావరి మధ్యప్రదేశమునందుండు తెలుఁగు బ్రాహ్మణులయందు మాత్రమే కానుపించుచున్నది.

ఇట్లు దేశభేదమువలనను, ఆచారభేదమువలనను, సూత్రభేదమువలనను భాషాభేదమువలనను, వ్యవహారసంబంధభేదమువలనను, గలిగి శాఖలుగాక బ్రాహ్మణులలో దేశభేదమునుబట్టి మఱికొన్ని తెగలేర్పడినవి ఈతెగలలో వెలినాడు, ములికినాడు, తెలగాణ్యము, వేగినాడు కాసలనాడు మొదలగు తెగలు మనమెఱుఁగుదుము. నాడను పదము అచ్చతెనుఁగుపదమగుటచే నీనాడుల భేదము తెలుఁగు దేశమునందే పుట్టినట్టును, ఇతర దేశములందు లేనట్టును స్ఫురించుచున్నది కాఁబట్టియే తెలగాణ్యము ములికినాడు మొదలగు పైనచెప్పిన నాడుల భేదములవారు తెలుఁగుదేశము నందలి బ్రాహ్మణులయందేకాని యితరులయందు లేరు నాఁడు అను పదమునకు దేశమని యర్థము ఈనాడుల భేదములు పుట్టుటకు అనేకులు అనేకములగు కారణములను చెప్పుచుందురుకాని అవియంతగా విశ్వాసపాత్రములు కావు ఈభేదము లెట్లు పుట్టినను ఈతెగలవారు భోజనప్రతిభోజనములను మాత్రము మానుకొనక వివాహసంబంధములను మాత్రము మానుకొనుచున్నారు

పైచెప్పినరీతిగాఁ జతుర్వర్ణములోను అనేకములగు పలువిధములయిన శాఖాసంఘము లేర్పడినవి ద్రావిడులలో శాఖాభేదము లేక యున్న తెగలవారును వివాహసంబంధములను మాత్రము మానుకొనినను భోజన ప్రతి భోజనములను మాత్రము మానుకొనియుండలేదు. పూర్వకాలములయం దొకదేశమునుండి మఱియొకదేశమునకుఁబోవుటకుఁగల ప్రయాణాయాసమునుబట్టియన్యదేశీయులైనచో వర్ణభేదము తిన్నగా తెలియక కొన్నికొన్ని తావులలో మోసపడి యన్య జాతివానికి పిల్లలనిచ్చుట తటస్థపడినందున నిన్ని శాఖలేర్పడి యాయాశాఖలలో వివాహసంబంధములు పోయినవని నేనూహించెదను. కారణము స్వల్పమయినను ఈశాఖలను వేఱుచేయుటకు మిక్కిలి బలవత్తరముగానయినది. అప్పటికాలమునకే శాఖాభేదములు యుక్తముగానేయున్నను ప్రకృతమునందు మాత్రము మిక్కిలి యొక్కువకష్టములను కల్పించుచున్నవి.

ఈ భేదములను వేనినిగణియింపక యేవర్ణమువా రావర్ణమువారితో వివాహసంబంధములు చేసికొనుటకు అభ్యంతరములును దేశమత భాషా భేదములున్న మాత్రము చేతనే వివాహములు మానుకొనుటకుఁ దగిన కారణములును ఎచ్చటను గానుపించవు భాషాభేదమువలనను, మత భేదమువలనను ఒకవేళ సంబంధములు మానుకొనినను, ఒకభాషనేమాటాడు నేకమతమువారు తమలో నాచార భేదమువలనను, నాడులభేదమువలనను గలిగిన శాఖాభేదములను పాటించి వివాహములుమానుకొనుట యుక్తముకాదని నేను భావించెదను. [సశేషము.]

28 కొ. రా. వేం. కృష్ణారావు

జ య ద్ర ధ నా ట క ము. (౪౭౦-పుట శేషము.)

జయద్ర—అది పారవేసితివా? పోయినదా? కనుపించుట లేదా?

గుణ—దైవము మనకు తోడ్పడుగాక!

జయద్ర—ఏమని యెదవు?

గుణ—అది పోలేదు పోయిననేమి?

జయద్ర—ఏమి?

గుణ—అది పోలేదంటిని

జయద్ర—అదియిటు తెమ్ము; నేను చూడవలెను.

గుణ—అది నేను తేగలనుగాని నేనిప్పుడు తేను. మీవాగ్దత్తము నిలుపవలసి వచ్చునని మేలమాడుచున్నారు. జయంతు ననుగ్రహింపుడు

జయద్ర—రుమాలు కొని తెమ్ము నామనస్సు చెదరుచున్నది.

గుణ—జయంతునికి త్వరితముగా నుద్యోగ మొసగుడు. అతనికంటె ఘనుడు మనకు దొరకడు

జయద్ర — రుమాలు!

గుణ—జయంతునివిషయమయి మాటాడుడు

జయద్ర—రుమాలు!

గుణ—మిమ్ము ప్రేమించి కష్టసుఖములకు మీర దిక్కుగా నెంచి—

జయ—రుమాలు

గుణ—నిజముగా మీసంగతి బాగులేదు.

జయ—ఛీ! ఛీ! (నిష్క్రమించుచున్నాడు)

సద్గుణ—ఈయనకు జారశంక మెండుగానున్నట్లు తోచుచున్నది.

గుణ—ఇట్లిదివరకెన్నడును చూచియెఱుగను నిశ్చయముగా రుమాలులో నేదో మాహాత్మ్యమున్నది. అదిపోవుట నాకు చాల విచారముగానున్నది.

దుర్గు—ఒకటి రెండు సంవత్సరములు చూచినగాని మనుష్యుని గుణము బాగుగా తెలియదు. పురుషులనే యన్నకోశములలో పోల్చితిమేని స్త్రీలే వారికి నాహారమగుదురు. అప్పుడా యన్నకోశము లాకొన్నచో భుజించుటయు, లేనిచో నెట్టియన్నమయిన పారవేయుటయు స్పష్టమగును అమ్మా! చూడుము. నామగడును, జయంతుడును వచ్చుచున్నారు

[జయంతుడును కలహప్రియుడును ప్రవేశించుచున్నారు]

కల—నీకిక రెండవదారి లేదు. ఆమెయే చేయవలెను. నీవామె కాళ్లపై బడితివేని సౌఖ్యపడియెదవు.

గుణ — ఏమి జయంతా! విశేషములు?

జయం — అమ్మా! నాపూర్వపు మనవినే తిరుగ జ్ఞాపకముచేయ నేతెంచితిని. నాపై ప్రభువులకు గలిగిన కోపము తమయొక్క యనుగ్రహమువలనగాక మరియొకరీతి నుపశమింపదు. ఈవిషయములో నేనింక జేచియుండను. నేనొనర్చిన తప్పిద మంత గొప్పదియై యిదివరకేనువడసిన మెప్పుగాని, ఇప్పుడు పొందుచున్న దుఃఖముగాని, ముందు నేజేయబోవు మేలుగాని, దానిని నావలననుండి తొలగించ లేనిచో, త్వరలో నీదేశమును౯డచి మరియొకదేశమునకైన బోయి పొట్టబోసి కొనెదను గాన నేదో యొకటి త్వరితములో తెలవలెను.

గుణ — అయ్యో! జయంతా! మూడుసారులు చెప్పితిని! మూడుసారులు నామాట ఉత్సృజించిరి. మునుపటివలె నామాట లిప్పుడు చెల్లుట లేదు. తుదకీవిషయ మయినమే నాపై యాయనకు కోపముగూడవచ్చినది. మనలను దైవము రక్షించు గాక! నీవుమాత్ర మోపికగలిగి శాంతచిత్తుడవై యుండుము. నాచేతనైనంత వరకు సాహాయ్యము చేసెదగాక! నాస్వంతవిషయముకన్న నీవిషయ మెక్కువ శ్రద్ధ వహించెదను.

కల — ప్రభువులు కోపమువహించినారా?

దుర్గ — ఎక్కడలేని కోపముజూపి యిప్పుడే యిక్కడనుండి యెటుపోయిరి?

కల — ఆయనకు కోపముగూడగలదా? నాడు తనతమ్ముడు తనయొద్ద నిలువబడి యుండగా యుద్ధరంగమందు గుండుదెబ్బదగిలి పడ్డప్పుడే కొట్టినవారు కోపము జూపలేదే? ఏమివింత ఏదియో రాజ్యాంగ విషయమయిన కలవిలమున మనస్సు చెదిరియుండును. సందేహము లేదు. నేనుబోయి కనుగొనెదను.

గుణ — నిశ్చయముగా రాజ్యాంగవిషయము కావచ్చును. మనకొక వేలిపైని గాయము తగిలిన నాబాధ శరీరమంతట వ్యాపించునటుల లోకదానిపై గలిగిన క్రోధము సర్వవిషయంబుల జూప బుద్ధిపుట్టుచుండును

కల — భగవంతుడట్లు యనుగ్రహించి యిది మీపై నేవిధమయిన యనుమానముల ౦ల్ల పుట్టిన క్రోధముగాకుండ జేయుగాత!

గుణ — ఎంతపాడదినము ఎన్నడయిన నాయనకు క్రోధము రాదగినట్లు మెలగితినా?

కల — అయిన జారశంకగలవారి కట్లక్కరలేదు వారికి లోలోన చెడుబుద్ధులు పుట్టుచుండును.

గుణ — జారశంకయనుదయ్యము మాతని జేరకుండునట్లు భగవంతు డనుగ్రహించుగాక!

దుర్గ — అట్లు చేయుగాత!

గుణ—నేను నా నాథునికడకేగెదను జయంతా! నీవిట వేచియుండుము సమయము దొరికెనేని నీవిషయమయి నొక్కి చెప్పెదను

జయ—తమకు నే గృతజ్ఞతాసూచకముగా వందన మాచరించెదను.

[ప్రియంవద ప్రవేశించుచున్నది]

ప్రియం—మిత్రుడా! నిన్ను జూచుటచే నేడుగదా నాకతిసాఫల్యమయినది.

జయ—ప్రియసఖీ! ప్రియంవదా! నీపై ప్రేమచేతనే నీయింటికే వచ్చుచున్నాను ఇంతయలసట కోర్చి నీవేల యరుగుదెంచితివి?

ప్రియం—నేను మీబసకు బోవుచుంటిని. మిమ్ములజూచి యేడుదినములైనది. అమ్మ ఏడుదినములు! ఏడుపగళ్లు! ఏడురాత్రులు! ఇరువదెనిమిదిజాములు! అబ్బా! నాలుగువందల యిరువది గడియలు మిమ్ము చూడకుండుటచే గడియ యొకయేడుగా నున్నది ఏమిచెప్పను? ప్రాణమునిలుపుకొనుటయే కష్టమయినది

జయ—ప్రియంవదా! నీప్రియుడు కష్టములపాలై యున్నాడని యెరిగియుండియు యిట్లనుట పాడిగాదు. తరుచు రాలేకున్నందుకు నన్ను క్షమియింపుము. నెమ్మది చిక్కిన వెంటనే నీమనస్తాపమారునట్లు నీయింటనే వసించెద.

[గుణవతి రుమాలామెకిచ్చుచున్నది]

దీని పనివాడితనము నీవును నేర్చుకొనుము

ప్రియం—జయంతా! నీకిది యెవరిచ్చిరి? ఎవరో క్రొత్తస్నేహితురాలని తలచెదను. నాపని యీకాడికి తెచ్చితివా? బాగు! బాగు!

జయం—నీవిచ్చిమాటలు చాలించు. నాకిది యట్లు రాలేదు.

ప్రియ—మరిమీకిది యెక్కడ చేకూరె?

జయం—నాకిది నాగవిలో నేటియుదయమున దొరకినది. ఎవరిదో తెలియదు. వారు వచ్చిమరల నన్నడుగులోపలనె నీవీపని నేర్చుకొనవలెను. ప్రొద్దుపోవుచున్నది. నీవు బసకుబొమ్ము

ప్రియం—ఇది నన్నవతలకు పొమ్మనుట నెందువల్ల పోవలెను.

జయం—నేనిక్కడ జయద్రథుని దర్శనమునకై వేచియుంటిని. ఈ సమయమున నీసంగతి యాయనకు తెలియగూడదు. కాన నన్నువిడువుము.

ప్రియం—అట్లయినచో నన్ను కొంతవరకు సాగనంపుడు రాత్రియైన శీఘ్రముగా వచ్చెదరా?

జయం—ముఖ్యముగా రాత్రి వచ్చెదను త్వరితముగా గృహమున కేగుము.

ప్రియం—చిత్తము. [నిష్క్రమించును.]

ఇది తృతీయాంకము.

జయద్రథ నాటకము.

చతుర్థాంకము

రంగము — లక్షద్వీపము, కోటగుమ్మము

[జయద్రథుడును, కలహప్రియుడును ప్రవేశించుచున్నారు]

కల—మీరట్లు యోచించెదరా?

జయద్ర—అట్లు యోచించెదను.

కల—రహస్యముగా ముద్దిపెట్టుకొనియేనా?

జయద్ర— ఔను. న్యాయవిరుద్ధమయిన ముద్దు' ఇట్టిముద్దునకు తావొసగిన నెంత నిర్దోషహృదయములైనను తమసద్గుణముల వీడుననుటకు సందేహము లేదు.

కల— అయిన వారొనర్చిన దోషమంతగా లేదు కొద్దిపొరబాటు దానికేమి. నేను నాభార్యకు కానుకగా నొకరుమాలు నొసగితినేని—

జయద్ర—ఒసగిన నేమి?

కల—ఒసగిన నది యామెసొమ్మే యగును కాన దాని నామె యెవరికైన నిచ్చివేయ వచ్చును.

జయద్ర— అట్లయిన నామె తన యధీనములోనగల తనపాతివ్రత్యధర్మము నిచ్చివేయ వచ్చునా?

కల— పాతివ్రత్యధర్మ మితరుల కగుపడునది కాదుగాన, యనేకు లట్టిధర్మమును గలిగియుండకయే కలిగియున్నట్లుందురు. దానికేమి రుమాలుసంగతి—

జయద్ర—దైవసాక్షి. నేను సంతోషముగా మరచియుందునుగదా! జ్ఞాపకము చేసితివి. పీనుగువెడలగల గృహముపై పులుగు వ్రాలిన రీతి నామనోనిలయంబున కనుపించె— నారుమా లాతనియొద్ద నున్నదా?

కల— ఇప్పు డామాటలేల?

జయద్ర— నీమాట లంతసమయోచితంబులుగా లేవు.

కల— నేను మీకుచెప్పిన విషయములు కన్నులార చూచుటవలనను బాగుగవినుట వలనను చెప్పినవిగాని వేరుకావు తుచ్ఛులు రంకులాండ్ర వలలతో బాగుగా దగులుకొనియుండి యప్పుడప్పుడు తమలోని బుద్ధుల నితరులకు చెప్పుచుందురు.

జయద్ర—అతడు నీకేమయిన నెరిగించెనా?

కల—చెప్పినాడు. ఏమన్నను తిరుగ నడిగితిమేని బొంకుటకు వెనుకదీయడనిమాత్ర మెరిగియుండుడు

జయద్ర—ఏమి చెప్పెను?

కల—చేసినానని చెప్పినాడు! ఏమి చేసినాడో నే నెఱుగను.

జయద్ర—ఏమి! ఏమి! రుమాలు? ఒప్పుకొనుట! రుమాలు ఒప్పుకొని యువిదీయబడుట? ఉరితీయబడి యొప్పుకొనుట! మాటమాత్రన గుండె లదలుచున్నవి. కారణము నిజముగాక యిట్టి మనస్తాపముండదు! ఛీ! ఛీ! ముక్కులు, చెవులు, పెదవులు నిజమేనా? రుమాలు! దుర్మార్గుడా! (మూర్ఛపోవును)

కల—ఓ నాయనృతవిషమా! పనిచేయుము. ఔషధమీరీతిగా పనిచేయవలెను. పనిచేయుము తెలివితక్కువ నిర్భాగ్యులిట్లు వలలలో పట్టుకొనబడుదురు. పతివ్రతలట్లు పాడుచేయబడుదురు అయ్యో! అయ్యో! మహాప్రభూ!

[జయంతుడు ప్రవేశించును]

ఏమి చేయను?

జయం—ఏమిది?

కల—మన ప్రభువులకు మూర్ఛవచ్చినది. ఇది రెండవసారి. నిన్న నొకమారిట్లు బాధపడిరి

జయం—కణతలయొద్ద చేతితో నివురుము.

కల—వద్దు వద్దు అట్లొనర్చితిమేని తత్క్షణము మతి చలించగలదు అదే లేచుచున్నారు. మీ రించుక సేపవతలనుండి మరల నేగుదెంచితిరేని మీతో కొన్ని యగత్యమయిన మాటలు చెప్పవలెను.

(జయంతుడు నిష్క్రమించుచున్నాడు)

అయ్యో! ఏమి? తలకు గాయముతగిలెనా? ఏమి?

జయద్ర—నీవు నాతో పరియాచకమాడుచుంటివా?

కల—పరియాచకమాడెదనా? ఎంతమాట! మీరీవిషయమున మీధైర్యస్థైర్యములెల్ల చూపవలెను.

జయద్ర—వాడాసంగతి యొప్పుకొనెనా?

కల—అయ్యో! తమరు ధైర్య మవలంబించవలెను. పెండ్లిచేసికొనిన ప్రతి పురుషుడును తనువలె మోసపోయినవాడే యనిమాత్ర మెరిగియుండుడు. అనుదినమును సూర్యాస్తమయమును వేచియుండి యెందరితరులశయ్య లలంకరింతురు. వ్యభిచార మెరుగని స్త్రీ గలదా? మీరింకనదృష్టవంతులు. ఆహా! పతివ్రతయను నమ్మ

కముతో వ్యభిచారిణియగు భార్యను ముద్దిగుటకంటె విచారకరమగు విషయమేమిగలదు? గనుక మనమూమెన గతి సర్వవిషయములు వెల్లడియైనపిదప యోచింతము.

జయద్ర—నీవు బహుబుద్ధిశాలివి నీ మాటలన్నియు వేదవాక్యములుగా నున్నవి

కల—తమరించుక నేను మరుగుననుండుడు మీకొక చిత్రకథను వినుపించెదను. తమరిప్పుడు విచారసముద్రములో మునిగి యొడలు దెలియకున్న యవసరమున జయంతు డిటకరుగుదెంచె. సమయము కాదనిచెప్పి యవలకుబంపితిని. తమరించుక పొంచియుండిరేని యతనినోటనే సర్వవృత్తాంతము వెల్లడిచేయించగలను. అతని సంతోషమును నవ్వును చిత్తగింతురుగాక. ఇదివర కెన్నిసారు లెక్కడెక్క డేయేరీతుల కార్యములుజరిగెనో యాసంగతులన్నియు పలికించెద. తమరతిశాంతవంతులయి యుండవలెను.

జయద్ర— తెలిసినది. నేనతిశాంతమును తెచ్చిపెట్టికొనియెదను. తెలిసినదా?—రక్తము త్రాగెదనుసుమా పిమ్మట.

కల—బాగుగ నేయున్నది ఎప్పుడైన కాలానుగుణ్యమయిన పని నొనర్పవలెను

[జయద్రధుడు చాటున పొంచియుండును.]

నేనిక జయంతునితో ప్రియంవదవిషయమయి ముచ్చటించెదను. తనశరీరసౌఖ్యమును విక్రయించియున్న వస్త్రములు సంపాదించుచున్నను ప్రియంవదకు జయంతునియెడ ప్రేమమెండు. ఐన నది వ్యభిచారిణులకు ముఖ్యలక్షణమే కాన నాక వింతగాదు.

చ॥ చనువున బొంకిబొంకి తమ చక్కదనంబులు చూపిచూపి నే
ర్పున హీనవారినెందరినొ పూర్తివిపద్దశ దింపిదింపియున్.
దినపతిజారిణుల్ తుదకు దీనునినొక్కని జేరి వానికిన్
మనములు ధారవోతురు ప్రమాదము లెన్నగలేక నక్కటా!

నామాటలు విన్నతోడనే జయంతుడు నవ్వకమానడు. అదె యాతడు వచ్చుచున్నాడు. అతడు నవ్వినకొలది జయద్రథునకు మతి నిశ్చయముగా చలించును. నవ్వు నాలుగువిధముల చెరుపనుమాట నిశ్చయమగును.

క॥ ఆతని పలుకు లరీతియు
నాతని దరహాసముఖము నవలోకనచే
నీతనికి మనసుచెడి సతి
నాతురతను జంపువిధము లాలోచించున్.

[జయంతుడు ప్రవేశించును]

ఏమండీ! సేనాద్వితీయనాయకా! ఏమివార్తలు?

జయం— నాయుద్యోగము పేరెత్తకుము నామనస్సునకు మరింతవిచారహేతువు.

కల—గుణవతిని పట్టనే పట్టితివి నీకు కొదవేమి? ఆమెనమాత్రము విడువకుము.

(రహస్యముగా) ఆపని ప్రియంవద చేతిలో నుండెనేని చెప్పవలసినదేమున్నది?

జయం—పాపము! వెఱ్ఱిబాలది!

జయద్ర—ఏమానవ్వు!!

కల—మగవారి నింతగా ప్రేమించు స్త్రీని నేనెక్కడను జూచియెరుగను.

జయం—మతిమాలినది! నన్ను మిక్కిలి ప్రేమించునుసుమా.

జయద్ర—అచే! లోనిమాటల వెల్లడిపరచుచున్నాడు. చిరునవ్వు నవ్వుచున్నాడు!

కల—విన్నారా? జయంతా!

జయద్ర—కలహప్రియుడు మరల చెప్పుమని బలవంత పరచుచున్నాడు. భేష్! భేష్! తగినవాడవు కలహప్రియా!

కల—నిన్నామె పెండ్లాడదలచినదని వాడుక నీయభిప్రాయమేమి?

జయం— హా! హా! హా!

జయద్ర—ఏమాపొగరు! ఏమానీలుగు!

జయం— నేనామెను పెండ్లియాడుటా! ఏమివింత! ఛీ! వట్టిరంకులాడి! నాకిట్టి మాటలు చెప్పకుము! నేనంత తెలివితక్కువవాడనా! హా! హా! హా!

జయద్ర—నవ్వు! నవ్వు! నవ్వు! గెలిచినవాడు నవ్వకమానునా?

కల—నీతోడేసరి. నీవామెను పెండ్లాడెదవని వాడుక.

జయం—ఎందుకాకల్లలు?

కల—నీపాదములసాక్షి. కల్లలాడుట లేదు.

జయం—సరే? నాజీవితకాలము లెక్కించి యుంచితివా?

జయం— ఇది యాగత్తురాలు పుట్టించినవాడుకగాని మరియొకటిగాదు. ఆమెకు మాత్రము నన్ను పెండ్లాడవలెనని యున్నది. నాకిష్టములేదు.

జయద్ర— తనలో కలహప్రియుని ప్రోత్సాహముచే నాతడు సర్వవృత్తాంతమును మరల చెప్పుచున్నాడు.

జయం—ఇప్పుడిప్పుడే యామె యిచ్చటికి వచ్చినది. నేనెటుపోయిన నన్నువిడువక యనుగమించుచునే యుండును. మొన్న సముద్రతీరమున కొందరుస్నేహితులతో ముచ్చటించుచుంటిని. అక్కడకు గూడ నేగుదెంచి నాపై నిట్లుపడి

యాలింగనము చేయనారంభించెను చిత్రము!

జయభద్ర—‘ఓ ప్రాణనాథా! జయ తా’’ యనేకాబోలు

జయం—ఇదేరీతి రేయంబగళ్ళు నన్నువిడువడు నాయందు మనసునిలిపియుండును హా! హా! హా!

జయభద్ర— నా పడకగదిలోనికి నీవువచ్చుటకు కారణమును నీవువచ్చినవిధము నిప్పుడుగదా చూచితిని. ఔను నిడుదయగు నీముక్కు నాకంటికి ముల్లువలె నగుపడుచున్నదిగాని దానిని తినబోవు కుక్కమాత్ర మగుపడుట లేదు.

జయం—నేనింక నా మెస్నేహము మానవలెను

కల—నా ముందరనే? అటుచూడుము

జయం—ఇది రెండవగండుపిల్లి అయినను వాసనగల పిల్లి!

[ప్రియంవద ప్రవేశించును]

ఏమి? నన్నొకనిముసమైనను విడువక వెంటాడించుచున్నావు

ప్రియం— నిన్ను కౌరవిదయ్యములు, భూతములు వెంటాడించుగాక! నీవిప్పుడు నాకొసగినరుమాలు నీకెక్కడిది? ఎవ్వరిచ్చిరో నిశ్చయముగా జెప్పుము. నీకెవరో ప్రియురాలు గలదని దీనివలన స్పష్టమేకదా? నేనెంతవెఱ్ఱినై చేకొంటిని. ఇదిగో నీరుమాలు. నీతొత్తుకే యిచ్చుకొమ్ము! నాకక్కర లేదు.

జయం—ఏమి యీావింత! ప్రియసఖీ! ఏమియీావింత!

జయభద్ర—అరుమాలు నాదియేయని యూహించెదను

ప్రియం—నీయిష్టము రాత్రి నాయింటికి భోజనమునకు వచ్చిరావచ్చును. మానిన మానవచ్చును నీచిత్తమెప్పుడప్పుడరమ్ము [నిష్క్రమించును]

కల—ఆమె ననుగమింపుము! త్వరితముగా బొమ్ము

జయం—ముఖ్యముగా నట్లొనరింపవలెను లేనిచో వీధిబడి నన్నునిందించగలదు.

కల—మీకీరాత్రి భోజనమచ్చటనేనా?

జయం— అచ్చట చేయవలెననియే యున్నది.

కల— నేటిమధ్యాహ్నము మిమ్ము కలిసికొనియెదను. మీతో నాకగత్యమగు పని యొకటి గలదు

జయ—నాతోవచ్చెదవా?

కల—ఇప్పుడు రాను మీరునడుండు

[జయంతుడు నిష్క్రమించును]

జయభద్ర—(ప్రవేశించి) కలహప్రియా! నేనతని నెట్లు చంపుట? [సశేషము]

కల— అయ్యో! అతడు తనదుష్కార్యమును తలచుకొని యెట్లునవ్వెనాడో చూచితిరా?

జయద్ర— ఔను కలహప్రియా!

కల—మీరుమాలు మీరుచూచుకొంటిరా?

జయద్ర—ఆరుమాలు నాదియేనా?

కల—మీపాదములసాక్షి! అదిమీదే చూచితిరా? బుద్ధిహీనురాలగు మీభార్య నాతడెట్లుపొగడెనో! మీభార్య మీరుమాలతనికి కానుకగానొసగె నాతడు దానినే తనలంజెకిచ్చె

జయద్ర— అతనిని ముక్కముక్కలు కోయించెద. రూపురేఖా విలాసంబులమాత్ర మట్టిస్త్రీ నింకగానము! ఏమిసౌందర్యము! ఏమిలావణ్యము!

కల—మీరీసంగతులుమాత్రము మరువవలెను.

జయ—ఇంకనామెను కుళ్ళికుళ్ళి చావనిమ్ము. ఇంకనామె యీలోకమునందుండదగియుండలేదు. కాన నేటిరాత్రి యామెప్రాణములు గొనవలెను. లేదు నా గుండె లింకరాయిపారినవి. నాకెట్టిభయమునులేదు, కాని,—

క॥ అకటా! యీలావణ్యము
నకటా! యీచక్కదనము నకటకటకటా!
అకటా! యీ మృదునిస్వన
మకటా! యికనెందునైన నరయంగలనే?

కల—ఇవి మీరీస్థితిలో యోచించదగినవి కావు.

జయ—ఉరిదీయవలెను! కాని, ఉన్నమాట లాడెదను.

సీ॥ చేతకిన్నరముట్ట చెవులపండువజేయు సర్వాంగనలు వేడ్కసాగియాడ
కేలసూచిక మృదులీలబూనినయంత కనులనానందాబ్ధి తనుపజాలు
పెదవినించుకవిప్ప మృదువాక్యసరణుల పెల్లువలొల్కించి వెడలమాన్పు
నాలింగనాదుల నమరియుండెడువేళ అకట! దైవము! యేమనందు! నింక!

కల—గీ॥ కార్యమేటికి యెన్నున్న వీర్యవంత
తగు పతివ్రతలకు నిట్టి సుగుణమణులు
గలిగనేనియు శోభిల్లుగాని యిట్టి
దుష్టురాండ్రకు గలిగిన తొడరుకీడు

జయ—సందేహమేమి? అయితే ఏమినమ్రత!

కల—కొంచె మతిమిక్కిలి.

జయ—నిజమే. అయితేనేమి కలహప్రియా! అదే విచారకరమగు నంశము.

కల— తమ కామెపై నంతమోహము కలదేని యామెకు తన యిష్టకార్యములెల్ల నాచరించునట్లు శాసన మొసంగుడు ఇట్టికార్యములు తమకు తగవిరానిచో నికమాకా!

జయద్ర— ఆమెను ముక్కలుగాకోసి గ్రద్దల కెగరవేసెదను నన్ను మోసపుచ్చ సాహసించెను! ఎంతపని!

కల—అది యామెలోపమే యగును.

జయద్ర— నా సేవకునితో నా—

కల— అది మరింతలోపము

జయద్ర—నేడు నాకింతగరళము తెచ్చిపెట్టుము, ఆమెను కన్నులముందర చూచుచు చంపనెంచిన యామె రూపలావణ్య విలాసాదులు నామనంబును త్రిప్పగలుగు నేమో. కాన ముఖ్యముగా విషప్రయోగమువలన నామె ప్రాణంబులు గొనవల యును, మరువకుము.

కల—విషప్రయోగము వలదు. ఏశయ్యపై ద్రోహమాచరించి మీ మర్యాదభంగము గావించెనో యాశయ్యపై నిద్రించుతరి గొంతుపిసిగి చంపుటమేలు.

జయద్ర—బాగు! బాగు! నీన్యాయబుద్ధికి మెచ్చితిని, నీయాలోచన బహుయోగ్య ముగా నున్నది.

కల—ఇక జయంతుని నాకు విడిచిపెట్టుడు, నిశరాత్రి గాకముందే యాతనిచావు మీరు వినగలరు.

జయద్ర— సరి! సరి! ఇది బహు సంతోషవార్త (తెరలో చోపుదారు ప్రభూ!) ఏమాధ్వని?

కల—కాశ్మీరమునుండి యేద్దియోవార్త వచ్చినది. ఆవచ్చిన యాతడు మనసూక్ష్మ బుద్ధియని నమ్మెదను అదియాతడే— చూడుము, నీభార్య యాతనితో నెట్లు ముచ్చటించుచున్నదో.

[సూక్ష్మబుద్ధి, గుణవతి, సేవకులును ప్రవేశింతురు]

సూక్ష్మ— శూరవర్యా! మీకు శుభమౌ గాక.

జయద్ర—దైవము మిమ్ముల గాపాడుగాక!

సూక్ష్మ—రాజును మంత్రులును తమక్షేమమరయ నన్ను బుత్తెంచిరి. (జాబునిచ్చును.)

జయద్ర—ఈ వారి యాశీర్వచన పత్రికకు సభక్తియుతుడనై మ్రొక్కుచున్నాను. (చదువుచున్నాడు.)

గుణ—అన్నా! సూక్ష్మబుద్ధీ! మనయూర విశేషములేమి?

కల—అయ్యా! మీసందర్శనమువలన నేడు కృతార్థుడనైతిని. నేనకాదు. ఈలంక ద్వీపమే కృతార్థమయ్యెను.

సూక్ష్మ—మిమ్ము నందరను జూచుటచే నాకును కన్నులపండువగా నున్నయది. మన జయంతు డెట్లున్నాడు?

గుణ—అన్నా! అతనికిని నానాధులకును లేనిపోని వివాదము సంభవించెను, అది మీవల్ల కుదుటపడవలెను.

జయద్ర—నిశ్చయమేనా?

గుణ—ఏమి సెలవు?

జయద్ర—(చదువుచున్నాడు) "ఈకార్యము తప్పక నెరవేర్చవలెను"

సూక్ష్మ—మిమ్ముల నాయన పిలువలేదు. ఉత్తరమును చదువుచుండర నున్నాడు. వీరికిని జయంతునకును వివాద మేల సంభవించెను?

గుణ—కారణశూన్యమగు కలహము జయంతుడు మిగుల నదృష్టహీనుడు, అతనిపయి నాకుగల దయకు నీకలహనివారణమున కేమియైన జేసెదను.

జయద్ర—ఉద్ధరి నల్లముడుగు!

గుణ—ఏమి సెలవు?

జయద్ర—నీకు బుద్ధిగలదా?

గుణ—ఏమి? ఆగ్రహముగా నున్నారాయేమి?

సూక్ష్మ—ఈవుత్తర మాయనమనంబును చలింపజేసియుండును ఏలనన రాజీసేనానాయకత్వమును జయంతున కిచ్చి వీరిని మరల దేశంబునకు రమ్మని యాజ్ఞ యిచ్చియున్నారు

గుణ—ఇదియును నాకు సంతోషవార్తయే.

జయద్ర—నిజముగానే!

గుణ—ఏమి సెలవు? నాధా!

జయద్ర—నీసంతోషమునకు నాకు పిచ్చిపుట్టుచున్నది.

గుణ—ఏమి నామనోనాయకా! అట్లని యెదరేమి?

జయద్ర—(కొట్టుచున్నాడు) దయ్యమా!

గుణ—నేనిట్లు శిక్షింపబడవలసినదానను కాను.

సూక్ష్మ—మహాప్రభూ! మీరిట్టిపని చేసితిరని నేప్రమాణము జేసినను మనదేశంబున నామాట నమ్మబడదుసుడీ! అబ్బా! ఎంతపని చేసితిరి. ఆమెను బ్రతిమాలుడు.

(కంట తడిపెట్టుచున్నది.)

జయద్ర— ఛీ! దయ్యము! పిశాచము స్త్రీలకన్నీటివలన భూమియందు జంతుజాలము పుట్టగలిగినచో ప్రతి కన్నీటిబిందువయు నొక్కొక్క మొసలిగా మారు. ననుటకు సందేహము లేదు

గుణ— నేనిచ్చట నుండుటవలన మీమనస్సునకు నొప్పి కలిగించును.

సూత్ర— నిజముగా నీమె వినయవిధేయతల కాస్థానము. అయ్యా! మీకు క్రొమ్మెక్కెదను ఆమెను మరల పిలువుడు?

జయద్ర— కోమలీ!

గుణ— ఏమి సెలవు?

జయద్ర— అదె వచ్చినది, మీ రేమి చేసెదరు?

సూత్ర— నేనా! అయ్యా!

జయద్ర— వెనుకకు పిలువమంటిరి కాదా? ఆమె వెనుకకు రాగలదు. మరల పోగలదు. ఎన్నిసారులైన తిరుగగలదు ఏడువగలదు. అతివినయముగా నటింపగలదు. ఇంకను ఏడ్చుచుండును; ఈయుత్తరమువలన—ఏమినటన—నేనింటికి పిలువబడితిని— అవతలకుబొమ్ము. మరల బిలిచెదను నేను వారియాజ్ఞలకు బద్ధుడనయ్యెదను. కాశ్మీరమునకు బోయెదను. ఛీ! ఛో! (గుణవతి నిష్క్రమించుచున్నది) జయంతునకు నాయధికార మిచ్చెదను. ఈరాత్రి మీరు మాయింటికి విందుకు దయచేయుడు కుక్కలు నక్కలు! (నిష్క్రమించును.)

సూత్ర— ఆహా! ఆశ్చర్యము! ఆశ్చర్యము!

ఉ॥ ఆతత శౌర్యభూషణుడు నంచిత వాక్యవిలాస నైపుణీ
జాతయశస్కు డూర్జితుడు శాంతసువిగ్రహు డాప్తబాంధవుం
డీతడటంచు రాజ్యభర మేని భుజంబున రాజునిల్పె నా
ఖ్యాత బలాఢ్యు డీతడ! జయద్రథు డాయని శంకదోచెడిన్.

కల— ఈయన మిక్కిలి మారినారు

సూత్ర— కొంచెము మతిచలించినట్లు కనుపించుచున్నదే!

కల— ఈవిషయమయి నాయభిప్రాయము నేను చెప్పను.

సూత్ర— ఏమి! వింత! భార్యనుకొట్టుటయా!

కల— అది తప్పేయగును ఇంతకంటె గొప్పకార్యములతో పోల్చినప్పుడు మాత్రమిదియంత నేరముగాదు.

సూత్ర— ఇది యభ్యాసమా? లేక యీయుత్తరము చూచుటవలన నిట్టికోపము వచ్చినదా?

[సశేషము.]

సూర్యశతము. (౪౭౪-పుట శేషము.)

స్ర॥ ప్రత్యుప్తస్తప్తహేమోజ్జ్వలరుచిరచలః పద్మరాగేణయేన।
జ్యాయః కింజల్కపుంజం యదళికులశితే రంబరేందీవరస్య।
కాలవ్యాళస్యచిహ్నం మహితతమమహో మూర్ధ్నిరత్నంమహద్య।
ద్దీప్తాంశోః ప్రాతరవ్యాత్తదవికలజగన్మండనం మండలంవః॥ ౭౫॥

మ॥ ఎది ప్రత్యుప్తము తప్తహేమధరణీభృత్త్రోణి, మాణిక్యమా।
నెది యిందిందిర బృందసుందర సురాధ్వేందీవరాభ్యంతరా।
స్పద కింజల్క సమూహమౌ, సమయసర్పశ్రేష్ఠ మూర్ధంబునం।
నెది సద్రత్నము, లోకమండన మహాస్వద్బింబ మద్దేలెడున్॥ ౭౫॥

స్ర॥ కస్త్రాతా తారకాణాం పతతితనురవశ్యాయబిందుర్యదేందు।
ర్విద్రాణా దృక్స్మరారే రురసి మురరిపోః కౌస్తుభోనోద్గభస్తిః।
వహ్నేస్సాపహ్నవైవ ద్యుతిరుదయగతే యత్రతన్మండలంవో।
మార్తాండీయంప్రణీతా ద్దిశతుశుచితమాం శివముష్ణన్మహాంసి॥ ౭౬॥

మ॥ క్షయముం జెందెడు చందమామ, యిఁకఁ జుక్కల్గాఁచు నెవ్వండు, హృ।
చ్ఛయ హృన్నేత్రము నిద్రితంబు, హరివక్షఃకౌస్తుభం బప్రభో।
చ్ఛయ, మగ్నిద్యుతి ద్రాక్తిరస్కృతి, వివస్వద్బింబ మాప్తోదయం।
బయి యిర్లక్లైది దోఁచు వెల్గులిటు లద్దానందము ల్మీకిడున్॥ ౭౬॥

స్ర॥ యత్ప్రాచ్యాం ప్రాక్చకాస్తి ప్రభవతిచయతః ప్రాచ్యసావుజ్జిహానా।
విద్ధం మధ్యేయదహ్నా భవతి తతరుచా యేనచోత్పాద్యతేహః।
యత్పర్యాయేణలోకాన్ప్రతపతి జగతాం జీవితం యచ్చతద్వో।
విశ్వానుగ్రాహివిశ్వంస్సృజదపిచరవేర్మండలం ముక్తయేస్తు॥ ౭౭॥

మ॥ పరఁగుం బూర్వనఁ దోఁచునెద్ది, యుదయింపం బూర్వనౌనెద్ది, వా।
సరమధ్యంబున దీప్తమౌనెది, తతోఽస్రం జెద్ది చేయుంబవల్।
వరుసన్లోకములం దపించునెది, జీవమ్మెది లోకాళికిన్,।
భరణోత్పాదనకారి యాసవితృబింబం బుత్తమార్గంబిడున్॥ ౭౭॥

స్ర॥ శుష్యంత్యూధానుకారా మకరవసతయో మారవీణాం స్థలీనాం।
యేనోత్తప్తాః స్ఫుటంతో ఝడితితిలతులాం యాంత్యగేంద్రా యుగాంతే।

---

౭౫ ప్రత్యుప్తము=తాపఁబడినది సురాధ్వ=ఆకాశము.

౭౬. హృ . న్నేత్రము=(కామారి) శివుని నొసటికన్ను. ద్రాక్తిరస్కృతి=శీఘ్రముగఁ జొనుఁగుపడినది దోఁచున్=బలిమినపహరించును.

తచ్చండాంశోరకాండ త్రిభువన దహనా శంకయాధామకృత్స్నం।
సంహృత్యాలోకమాత్రం ప్రలఘువిదధత స్తాన్ము దే మండలంవః॥ ౭౮॥

మ॥ మరుశుష్కంబులవు న్మహోర్ధులు, గులత్కాంధర్వంబులు న్పెల్లియు।
ద్వరతాపంబున నష్టెయాను దిలమాత్రంబు ల్యాగాంతంబునన్,।
బరిరక్షింపఁ ద్రిలోక, నేఁడియుడి సర్వంబుఁ బ్రసాదించు శ్రీ।
కరమై వెల్గెది, భానుబింబమది ముత్కల్యాణముల్మీకిడున్॥ ౭౮॥

స్ర॥ ఉద్యద్ద్యాద్య నవాప్యాం బహులతమతమః పంకపూరం విదార్య।
ప్రోద్భిన్నం పత్రపార్శ్వ ష్వవిరళమరుణ చ్ఛాయయా విస్ఫురంత్యా।
కల్యాణానిక్రియాద్వః కమలమివ మహన్మండలంచండభానో।
రన్వీతంత్రప్తహేతో రసకృదలికులాకారిణారాహుణాయత్॥ ౭౯॥

మ॥ వినుబావింజనియించి, యిర్లడుసునిర్భేదించుచున్, బత్రపా।
ర్శ్వనవాంచద్బహులారుణద్యుతి వికాసంబొంది, గాసంబు చే।
కొన రాహుభ్రమరాళి మాటికిని వెన్కన్, నందముం జెందు పెన్।
వనజంబ ట్లినబింబ మెప్పుడు శుభప్రారంభము ల్మీకిడున్॥ ౭౯॥

స్ర॥ చక్షుర్దక్షద్విషో యన్నతుదహతి పరంపూరయత్యేవకామం।
నాస్తంజుష్టం మరుద్భిర్య దిహనియమినాం యానపాత్రం భవాబ్ధౌ।
యద్వీతశ్రాంతి శశ్వద్భ్రమదపిజగతాం భ్రాంతిమభ్రాంతిహంతి।
బ్రధ్నస్యావ్యాద్విరుద్ధ క్రియమపి విహితాధాయితన్మండలంవః॥ ౮౦॥

శా॥ అయ్యున్దక్షువిరోధిక, న్నగును గామాపూరణం, బోడబా।
నయ్యున్ సంసృతివార్ధియోగికి, మరున్నాస్తంబు, శశ్వద్భ్రమం।
బయ్యున్, విశ్రమ, మభ్రమంబును, హతాన్యభ్రాంతియై, విక్రియం।
బయ్యున్, సుక్రియ, మర్కమండలము కళ్యాణంబులం బాపెడున్॥ ౮౦॥

---

౭౭. తతోగ్రసంబు = వ్యాపింపఁజేయఁబడిన కిరణములుగలది. భర .. కారి = పాలనమును సృష్టిఁ జేయునది. ఉత్తమార్థంబు = ముక్తి.

౭౮ మరుశుష్కంబులు = చౌటినేలలవలె నెండినవి. యత్ = ఏబింబముయొక్క. ఉడి = ఉడిగి, సంహరించి ముత్కళ్యాణములు = ఆనందములు శుభములును.

౭౯ పత్ర = గుఱ్ఱములు, రేకులు. అరుణ = అనూరునియొక్క, ఎఱ్ఱని.

౮౦, కామాపూరణంబు = మన్మథుని వృద్ధిఁబొందించునని విరోధము. కోరికలు నిండించునని పరిహారము. మరున్నాస్తంబు = గాలిచేఁ జెదరఁగొట్టఁబడనిది,

అథరవివర్ణనమ్.

స్ర॥ సిద్ధైస్సిద్ధాంతమిశ్రం శ్రితవిధివిబుధై శ్చారణై శ్చాటుగర్భం।
గీత్యాగంధర్వముఖ్యై ర్ముహురహిపతిభి ర్యాతుధానైర్యతాత్మ।
సార్ఘ్యం సాధ్యై ర్మునీంద్రై ర్ముదితతమమనో మోక్షిభిః పక్షపాతాత్॥
ప్రాతః ప్రారభ్యమాణ స్తుతిరవతు రవి ర్విశ్వవంద్యోదయో వః॥ ౮౧॥

మ॥ వినతిన్దైత్యులు చారణుల్చటువులన్ వేమారుపాముల్ మనో।
ఘనత న్మౌనులు, సాధ్యులర్ఘ్యధృతిఁ బక్షంబొప్ప మోక్షుల్ సుగీ।
తిని గంధర్వులు సద్విధిన్విబుధులన్ ధీశుద్ధి సిద్ధుల్ నుతుల్।
పొనరింపన్ జనవందితోదయుఁడు మిమ్ముం బ్రోద్దు పాలించెడున్॥ ౮౨॥

స్ర॥ భాసామాసన్నభావా దధికతరపటో శ్చక్రవాలస్య తాపాత్।
ఛేదాదచ్ఛిన్నగచ్ఛ త్తురగఖురపుట న్యాసనిశ్శంకటంకైః।
నిస్సంగ స్యందనాంగ భ్రమణనికషణా త్స్వాతువ త్త్రిప్రకారం।
తప్తాంశు స్తత్పరీక్షా పరఇవ పరితః పర్యటన్హాటకాద్రిమ్॥ ౮౩॥

మ॥ కడుదాపోటను గాటమౌకిరణ చక్రంబంటఁగాక, త్రయం।
బుతివోకుండఁగఁబాఱు, నశ్వఖురటంకోత్కర్తనం, దౌలకా।
డెడుచక్రం బారయంగ గీటునను, మూడింట న్బరీక్షించు కై
వడిఁ జెప్పత్తడిగట్టు చుట్టు రవియుత్పాదించు మోదంబులన్॥ ౮౩॥

స్ర॥ నోచ్ఛ్వాస్యం నాకనద్యా వికసితకనకాంభోరుహం భ్రాజితంతు।
ప్లుష్టానైవోపభోగ్యా భవతి భృశతరం నందనోద్యానలక్ష్మీః।

(దేవతలచే సేవింపఁబడినది) అని వ్యతిరేకము. శశ్వద్భ్రమంబు — ఎప్పుడు సంచరించుట, తప్పు తెలివియు గలదయ్యు. విశ్రమము—ఆయాసము లేనిదని విభావన. అభ్రమంబును, తప్పుతెలివి లేనిదని విరోధము. ఆకాశమున లక్ష్మి గలదియని పరిహారము. హతాన్యభ్రాంతి—ఇతరుల (చలనమును) బోగొట్టు నని విరోధము, మిథ్యాజ్ఞానమునని పరిహారము విక్రియంబు— ఇట్లువిరుద్ధము లగు (నిషిద్ధములు) పనులుగలదయ్యు, సుక్రియంబు— సత్కర్మలు గలదియని విరోధము నిర్దోషములగు గుణములు కలదియు వేదోక్తకర్మలకుఁ గారణము నని పరిహారము.

౮౩. తౌలక— తగులక. ఆడెడు—తిరుగు. (బంగారమును, కాలుపు, కోత, గీటు, ఈమూటిచేఁ బరీక్షింతురు)

నోశృంగాణిద్రుతాని ద్రుతపమరగిరేః కాలధౌతాని ధౌతా।
నీత్థంధామద్యుమార్గే ప్రమదయతి దయయా యత్రసోఽవ్యాదినోవః॥ ౨౩॥

మ॥ ఖనదిన్ బొన్విరిదమ్మి భాసిలుచు శుష్కంబె తయుంగాదు సం।
దనలక్ష్మీవిభవంబు ముగ్ధమగు దగ్ధంబెంతయుంగాదు, రు।
క్మనగోచ్ఛృంగములెల్ల ధౌతములగు, గ్గాఢద్రుతిం జెంద, వే।
ఘనుఁడాత్మద్యుతి మార్ద్దవం బొనరుపంగా నయ్యినుండో మెడన్॥ ౨౪॥

స్ర॥ ధ్వాంతస్యైవాంతహేతు ర్నభవతి మలినైకాత్మనః పాప్మనోపి।
ప్రాక్పాదోపాంతభాజాం జనయతి నపరం పంకజానాం ప్రబోధం।
కర్తాని శ్రేయసానా మపితు నఖలుయః కేవలం వాసరాణాం।
సోవ్యాదేకోద్యమేచ్ఛా విహిత బహుబృహ ద్విశ్వకార్యోర్యమావః॥ ౨౫॥

మ॥ మలినైకాత్మకము ల్దొలంచు గురుపాప్మమ్ముల్ దమమ్మొండెనా,
వల, దబ్జమ్ములె గావు పాదగతుల న్బ్రాప్త ప్రబోధమ్ము మా।
నుల బృందమ్ముఁ, బగల్లెకా, దొనరుచు న్మోక్షమ్ము, సల్లోకతృ।
ట్కలితానేక జగద్ధితుండు రవి మీకిచ్చు ల్ఫలింపించెడున్॥ ౨౫॥

స్ర॥ లోడన్లోష్టావిచేష్టః శ్రితశయనతలో నిస్పృహో ముక్తదేహః।
స్పందేహీ ప్రాణితవ్యే సపదివశదిశః ప్రేక్షమాణోంధకారమ్।
నిశ్వాసాయాసనిష్ఠః పరమ పరవశో జాయతే జీవలోక।
శ్శోకేనేవాన్యలోకాభ్యుదయకృతిగతే యత్రసోర్కోవతాన్నః॥ ౨౬॥

మ॥ భువనంబన్యముఁ బ్రోవఁ బ్రొద్దితఁడు పోఁబోఁ బ్రాణిలోకంబు శో।
కవశంబౌగతి నెజ్జఁజేరి తనుకాంక్షం దూలి యేప్రొద్దు మౌ।
ద్ధువలేన్ సద్దులు దర్లనూర్పురురలం బోఁచంగ నెచ్చోనిరుల్।
వివశంబై మనసంశయంబు గనునా వేల్పిచ్చు నానందమున్॥ ౨౬॥

---

౨౪. ఖనదిన్=ఆకాశగంగయందు పొన్విరిదమ్మి=వికసించిన బంగారు పద్మము. ముగ్ధము=రమ్యము రుక్మ=బంగారు ధౌతములు=నిర్మలములు గాఢద్రుతి=మిక్కిలి కరఁగుట

౨౫ మలిన=నల్లనిది (పాపముకవిసమయమున, చీఁకటిరూపమున) పాదగతుల్=కిరణప్రసారములచే, చరణములను బొందుటచే. ప్రబోధ=వికాసము, ప్రత్యక్షజ్ఞానము తృట్=ఇచ్ఛ

౨౬ దూలి=దూషించి. సద్దులు=మాటలు.

[సశేషము]

అకుండి-వ్యాసమూర్తిశాస్త్రి.

స్త్రీహితోపదేశము. (౮౮౬ - పుటశేషము.)

ఈసాధనమువలన నొకసారి కార్యకారి కానియెడల రెండు లేక మూడుసార్లు చేసిచూడవచ్చును. అందువలన బాధయేమియును లేదు. విరేచనమునిమిత్తము శుభ్రమైన ఆముదముతప్ప మరేమాత్రలు మొదలయిన ఔషధములును ఇయ్యగూడదు. ఆముదము పుచ్చుకొనుటకన్నను ఎనిమా మంచిదని వెనుకచెప్పి యుంటిని గదా! అల్పాచమనముల లేనే విరేచనముకూడ ప్రసవించిన కొద్దిరోజులవరకును మంచముమీద పరుండియున్నప్పుడే అప్రయత్నముగా కావలెను, అందుకు దగినయేర్పాటు చేసినయెడల మేలు

ప్రక్షాళనము—ప్రసవించిన పిమ్మట నొకవారము వరకుగాని పదునైదు దినములవరకుగాని ఒకానొకప్పుడు ఇంకను మరికొన్ని దినములవరకుగాని గర్భమునుండి, మొదట ఎఱ్ఱగాను తరువాత క్రమముగా గోధుమవర్ణముగాను పిమ్మట ఆకుపచ్చగాను ఉండెడినీరు స్రవించుచుండును అదికొన్ని విషయములలో దుర్వాసన కలిగియుండును ఆ స్రవించుట మితముగా నుండుట అగత్యమే. విశేషముగా నైన యెడల ఆ స్త్రీకి చాలబలహీనము చేయును.

ప్రసవించినతరువాత ఆభాగములు ప్రక్షాళనచేయకూడదని చేసిన యెడల జలుబుచేయుననియు తెలియనివారందరు అందురు పైనిచెప్పిన ఉదకస్రావము కలిగినప్పుడుగాని లేక ఆభాగములస్థితినిబట్టిగాని అవసరమయినన్నిపర్యాయములు దినమునకు రెండుసార్లకు తక్కువకాకుండనయినను ఆభాగమంతయు పరిశుద్ధి చేయవలెను. చేయువిధమేమనగా బాగుగా కాచిన నీళ్ళలో ఫ్లానెలుగుడ్డ అనగా మృదువైన రోమసంబంధమైనది తడిపి ఆనీళ్ళు చాలవరకు పిండివేసి కొంచెమునీళ్ళు కలిగి వేడిగానున్నప్పుడు దానితో ఆభాగములన్నిటిని శుభ్రముగా తుడిచివేయవలెను ఇట్లు శుద్ధిచేయుటవలన శుభ్రత, ఆరోగ్యము, సద్యఃకాలసౌఖ్యమునుకూడ కలుగును. అట్లు జరిగించినయెడల చాల అసౌఖ్యములు సంభవించును. ఈప్రకారము శీతలప్రదేశములందుండువారును జరిగించుచున్నప్పుడు అందువలన ప్రమాదము కలుగునని మనదేశస్థులకు సందేహము సుతరాము లేదు. ఆభాగములు మిక్కిలి సలుపుగానున్నయెడల వేడినీళ్ళలో కొంచెము వేడికల్లుపురగకలిపి దానిలో గుడ్డముంచి పైనిచెప్పినవిధమున కాచవలెను కొంచెముసేపు కాచి వెంటనే మృదువైన వెచ్చని గుడ్డలతో తడిలేకుండ శుభ్రముగా అద్దివేసి వెచ్చనినూనె మృదువయిన గుడ్డతో ఆభాగమునరాయవలెను. ఇట్లు చేసినయెడల సలుపులుపోవును. లోపలిభాగములు మిగుల సలుపుగానున్నపక్షమున పైనిచేసినప్రకారము పిచికారితో అనగా స్త్రీలకు ఉపయోగించు పిచికారిలో లోపలిభాగములనుకూడ క్షాళనచేయవలయును. ఇట్లు

చేయుటకు బాగుగా తెలివిగలవారుండవలెను.

విశ్రాంతి— ప్రసవించినపిమ్మట ౧౦-౧౫ దినముల వరకును మంచముమీద సర్వదా పరుండియుండవలెనుగాని లేచికూరుచుండి యుండగూడదు. ఎందువల్లననగా గర్భమునకు ఏయొత్తుడు లేకుండ కొన్నిదినములుంచవలెను. అట్లు ఉంచుట పడుకొనియుండుటవలనమాత్రమే కలుగును. ఈదేశములో ప్రసవించిన పిమ్మట రెండుమూడుదినములైనను వెనుక స్వయముగా లేచియివతలకువచ్చికూరుచుండుట పెరడులోనికి పోవుచుండుట, ఈవిధముగా చేయుచుందురు. అట్లుచేయుచుండుట మంచిపనికాదు. ౫-౬ దినములవరకును పరుండియున్న మంచముమీదనె పరుండియుండవలెను. భోజనాదికములన్నియు అస్థిలిలోనే కావలెను. పిమ్మట రెండవ మంచముమీద పరుండవచ్చును. అట్లు పరుండబెట్టుటలో జబ్బుక్రింద చేతులువేసి యొకరును తుంట్లక్రిందపట్టి యొకరును కదలకుండ రెండవమంచముదగ్గరగా నుంచి అందుమీద పరుండబెట్టవలెను. తొమ్మిదవదినము మొదలుకొని లేచి ఒక గంటసేపు మాత్రము కూరుచుండుచు నుండవచ్చును. ఇట్లు జరిగించుట మిక్కిలి విసుగుగాను కష్టముగాను తోచునుగాని అప్పుడుపడుకష్టము పిమ్మట మేలుకలుగజేయును. బీదవాండ్రు ప్రసవించినది మొదలుకొని లేచి తిరుగుచుందురు. వారలకేమినష్టము కలిగినది అని అడుగుదురేమో. వారలు మోటువాండ్రగుటవలన అక్షణమునకలుగు రక్తస్రావము మొదలయిన బాధలుకలుగకపోయినను వారల కాకారణమున గర్భములు క్రిందికిజారి వ్రేలాడుచు మిక్కిలి శ్రమకరముగా నుండుటయేగాక పిమ్మట గర్భోత్పత్తి అయినప్పుడెల్ల దిగబడుచుండును. గర్భమునిలిచినను పుట్టుబిడ్డలు మిక్కిలి బలహీనులుగా నుందురుకావున ప్రసవానంతరము తిరుగులాడుటనుగురించి బీదవాండ్ర సాదృశ్యము తెచ్చుకొనగూడదు. ప్రసవించకపూర్వము వారలవలెనే అంతవరకు గాకపోయినను కొంతవరకయినను గృహకృత్యములు చేసికొనుచు తిరుగుచున్న పక్షమున వారలవలెనే నిరాయాసముగా ప్రసవింపవచ్చును. ప్రసవించిన పిమ్మట ౧౦-౧౫ దినములవరకును పరుండి యుండుటవలన గర్భము పూర్వప్రకారముగా సంకోచించి యథాస్థానమందుండును. అట్లు విశ్రాంతిని కలుగచేయక లేచి కూరుచుండుచు నడుచుచు ఉన్నయెడల క్రిందికిజారి వ్రేలాడుచు పైనిచెప్పిన బాధలకు ఆస్పదమగును. దైవవశమున గర్భము క్రిందికిజారినయెడల దానిని యథాస్థానమునకు చేర్చుటకు వైద్యుని సహాయముతో కొన్ని సాధనములు అనగా మైనపెడల్పుపాటి బద్దవంటిదానితో ఎత్తిపెట్టి కట్టుచుండుట మొదలుగా గలవి చేసికొనవలసి యుండును

ఆహారవిషయము—ఈదేశములో అనగా హిందూదేశముయొక్క కృష్ణా, గోదావరీ, విశాఖపట్టణమండలములలో ప్రసవించిన స్త్రీలకు మొదటి మూడుదినములలోను దాహమైనను ఇయ్యరు. మూడు లంఘనములు అనగా కేవలనిరాహారముగా మూడుదినములు గడచినపిమ్మట నాలుగవదినమున పథ్యమని కొంచెము అన్నము శొంఠిపొడితో పెట్టుదురు. ఈహిందూదేశములోనే ఉత్తర పశ్చిమ ప్రాంతములలో మొదటిరోజునుండియును దాహశాంతి చేయుచుందురట. పైని చెప్పిన మండలములలోనైతము క్షుద్రస్త్రీలు ప్రసవించినతోడనే లేక ఆదినముననైనను వేడిగంజిమొదలగునవి పుచ్చుకొనుచుందురు. దేశాంతరములయందు అనగా ఇంగ్లాండుమొదలగు దేశములలో ఈదిగువనుదహరించిన విధమున ఆహారమిచ్చుచుందురు. మొదటిదినమున చిన్నగిన్నెడు గంజిగాని అరరూటుజావగాని తేయాకునీళ్ళుగాని రెండుమూడుసార్లు ఇచ్చెదరు. రెండవదినమున కొంచెము రొట్టె, పాలు తేయాకునీళ్ళు ఇచ్చెదరు. మూడవదినము మొదలుకొని అంతకంటె కొంచెమెక్కువయిన మాంసాది హారములిచ్చెదరు. అయిదవ దినమునుండి మామూలు హారము పుచ్చుకొందురు దుర్బలులయిన స్త్రీలకు ప్రథమదినము మొదలుకొనియు బలపరచు పదార్థములిచ్చుచుందురు. దాహమునకు పాలును నీళ్ళును సమాన భాగములుగా కలిపి యిచ్చుటమంచిది. కేవలము పాలిచ్చినయెడల సులభముగా జీర్ణము - కాక పోవుటయేకాక విరేచనబద్ధము చేయును. పాలతో నీళ్ళుకలిపి పుచ్చుకొనినయెడల అట్టిబద్ధము చేయక అనుకూలమయిన కాలప్రవృత్తిని కలుగచేయును.

వెలుపలికివచ్చుట—ప్రసవించిన స్త్రీలు పదియేనుదినము లయినతరువాత ప్రసవగృహమువదలి వెలుపలికి వచ్చుచుండవచ్చును. కాని చాలసేపు కూరుచుండియుండగూడదు. ప్రసవగృహమందు ఉండుట విసుగుగానున్నయెడల మరియొక గదిలో పరుండుటమేలు. నెలదినములవరకును కూరుచున్న కాలముకంటె పరుండు కాలమే యెక్కువగా నుండవలెను. ఎందువలన ననగా వారినడునకు విశ్రాంతి ప్రధానముగా నుండవలెను.

చలికాలమయినయెడల ప్రసవస్త్రీలు తరుచుగా నిల్లువిడిచి వెలుపలికి పోగూడదు. నెలదినములయినతరువాత కొంచెము పోవుచు వచ్చుచు గృహకృత్యములను కొంచెముగా చేయుచుండవచ్చును. ప్రసవించినతరువాత కొన్నిమాసముల వరకును సోమరితనముగా నుండవలెనని కొందరి దురభిప్రాయమయి యున్నది. క్రమముగా గృహకృత్యములు కొంచెముకొంచెము చేయుచుండుటచేతనే శరీరారోగ్యము అనుకూలముగా చాలినంత స్తన్యము కలిగియుండునుగాని, సోమరులుగా

నున్నయెడల కలుగవు. సోమరితనమువలన శరీరమందు నొప్పులు, స్తన్యము లేకపోవుట యీ మొదలగు బాధలు కలుగును ఈవిషయమై స్తన్యవిషయమును చెప్పెడు పంచమాధ్యాయమున వివరముగా వ్రాయబడును. గనుక యీ అధ్యాయమింతటితో ముగించడమగుచున్నది.

స్త్రీ హితోపదేశము.

పంచమాధ్యాయము.

స్తన్యమిచ్చుటనుగురించి— స్త్రీహితోపదేశమను నీగ్రంథమం దిదివరకు బాల్యదారభ్య ప్రసవించువరకును ఏయే సమయమందు ఏయే పనులలో నెట్లు నడుచుకొనవలయునో విశదీకరించియుంటిని ఈ పంచమాధ్యాయమున శిశువునకు స్తన్యమిచ్చు తల్లియొక్క విధాయకకృత్యములను వివరించి యింతటితో ఈగ్రంథము యొక్క పూర్వభాగమును ముగించెదను. ఉత్తరభాగమందు తల్లులు పిల్లలను ఏ విధముగా పెంచి బాగుచేసికొనవలెనో వ్రాసెదను.

కొందరు స్థితిమంతులు సంసారసుఖలోలలైన స్త్రీలు తమశిశువులకు పుష్కలముగా నిచ్చుటకు స్తన్యముగలవారైనను మిక్కిలి క్రూరాత్మలయి తమశిశువులను పాలదాదులకప్పగించివేయుదురు. తమ స్తన్యము ఇగిరిపోవునట్లు పట్లుమొదలయినవి వేసికొందురు అటువంటివారు క్రూరజంతువులకంటెను క్రూరాత్ములని చెప్పవలసియున్నది తమశిశువులకు స్తన్యమియ్యని స్త్రీలకు తమబిడ్డలయందు ప్రేమయుండదు. వారిపుత్రులు తల్లులు లేని పిల్లలవలె దాదులవలన పెరగవలసినవారై పరస్పర ప్రేమ లేని వారైయుందురు. పిల్లలకు స్తన్యమిచ్చుటవలన మనస్సునకు విలక్షణమైన ఆనందము మాత్రమేకాకుండ మరికొన్ని లాభములునుగలవు ఏమనగా పిల్లలకు స్తన్యమిచ్చుచున్నయెడల అతిశీఘ్రముగ మరల గర్భోత్పత్తి కానేరదు తరుచుగర్భోత్పత్తియగుట యంగుల బలక్షీణముచేయును. స్తన్యమిచ్చుటవలన తల్లిశరీరమునకు బలమును కండపుష్టియుంగలుగును. తల్లి స్తన్యము పుచ్చుకొను శిశువులకును మంచిసత్తువయును దేహారోగ్యమును కలిగియుండును. కావున, దురదృష్టముచేత స్తన్యము లేకపోయిన గానిడక్కప్పుడు తమశిశువులకు తల్లులు స్తన్యమిచ్చుట విధాయకము. అట్లు చేసిన యెడలనే తల్లులనిపించుకొందురు. [సశేషము.]

మహుండి-రామారావు.

గుణ—ఎవరువారు? నానాథులా?

జయద్ర— ఔను.

గుణ—అయ్యో! పరుండెదరా?

జయద్ర—ఈరాత్రి దైవమును ప్రార్థించితివా?

గుణ—ప్రార్థించితిని నాథా!

జయద్ర—పశ్చాత్తాపములేక యేపాపముగాని మనస్సున దాచియుంచితివేని దానికై నిన్ను క్షమియింపుమని దైవమును త్వరితముగా ప్రార్థింపుము.

గుణ—అయ్యో! నాథా! మీమాటలు నాకర్థమైనవికావు.

జయద్ర— త్వరితముగా ప్రార్థింపుము నేనిక్కడ నడుచుచుండెద మరణమున కప్రయత్నముగనున్న నిన్ను చంపనొల్ల

గుణ—మరణముమాటలేల మాటాడెదరు?

జయద్ర—నిన్ను చంపెదను

గుణ—నన్ను దైవము రక్షించుగాక!

జయద్ర—ముఖ్యముగా రక్షించునుగాక!

గుణ—మీరట్లు చెప్పుచున్నారుగాక నన్నుచంపరని నమ్మెదను.

జయద్ర—హుమ్.

గుణ—మిమ్ముల జూచుటకు నాయొడలు కంపము జెందుచున్నది. మీరు కనిగ్రుడ్లట్లు త్రిప్పినప్పుడు ప్రాణోపద్రవము చేయకమానరు నేనేపాపము నెరుగనిదాన నగుటచే నేలభయపడవలెనో నేనెరుగను

జయద్ర—నీపాపములు బాగుగ జ్ఞాపకము చేసికొమ్ము

గుణ—మిమ్ములనత్యంతము ప్రేమించుటతప్ప మరి యేపాపము నెరుగను

జయద్ర—అందుకే నీవు చచ్చుచున్నావు

గుణ—ప్రేమించినందుకు చంపుటయన్యాయము. పండ్లక్రింద పెదవులకొరికెదరు? ఎద్దియో భయంకరమగు నవమానము మీమనస్సును పట్టినది ఈలక్షణములెల్ల నెద్దియో ఘోరకృత్యాచరణమును సూచించుచున్నవి అది నాపైకి రాదని మాత్రము నమ్ముచున్నాను.

జయద్ర—ఇంక మాటాడకుము.

గుణ—మాటాడను. ఏమిసంగతి?

జయద్ర— నిన్ను నేనెంతయో ప్రేమించి నీకు కానుకగా నొసగిన రుమాలు నీవు జయంతునకిచ్చితివి!

గుణ—మీవాదములసాంతే. నేనెప్పుడు నిచ్చియుండలేదు ఆతని పిలిచియుండగుడదు

జయచంద్ర—ప్రాణేశ్వరీ! ఇంక నన్నృతము మానుము. నీవు చచ్చుటకు సిద్ధముగా నున్నావు

గుణ—ఇంతటచావవగదా!

జయచంద్ర—ఇప్పుడే చచ్చెదవు. నీవార్జించిన పాపములుమాత్రము వెల్లడిపరుచుము. నీవెన్నిబాసలుచేసిన నామనస్సు తిరుగదు నిన్ను చంపకమానను.

గుణ—నన్ను దైవము కాపాడుగాక!

జయచంద్ర—ముఖ్యముగా కాపాడుగాక!

గుణ—నన్ను తమరుతు కాపాడెదరుగాక! నేను మీకెన్నడు నపకారమొనర్చి యెరుగను జయంతు నెన్నడును ప్రేమించలేదు ఎంతవరకు పరపురుషునితో స్త్రీలు మాటాడవచ్చునో యంతకంటె నధికమెన్నడు నాతనితో మాటాడనైన లేదు

జయచంద్ర—దైవముతోడు నారుమాలాతనియొద్ద చూచితిని. ఓకర్మాగ్రాలా! నాగుండె రాయి చేయుచుంటివి నాకన్నులార నారుమాలాతనియొద్దచూచితిని.

గుణ—అయినచో నది యతనికెక్కడనో దొరికియుండును. నేనాతనికిచ్చియుండలేదు. ఆతనిని పిలిపింపుడు. నిజమాతని నడిగిచూడుడు.

జయచంద్ర—ఆత డొప్పుకొనెను

గుణ—ఏమని నాథా?

జయచంద్ర—నీతో సౌఖ్య మనుభవించెనని?

గుణ—ఏమీ? అన్యాయముగానా?

జయచంద్ర—ఏమి?

గుణ—అతడట్లనియుండడు

జయచంద్ర—ఆతని నోరిదివరకె మూయబడినది. న్యాయశీలుడగు కలహప్రియుని కా పని నియమించితిని.

గుణ—అయ్యో! ఆతడు మరణమునొందెనా?

జయచంద్ర—ఆతని తలవెంట్రుకలెల్ల మనుజులుగా మారిన వారినందరి మ్రింగశక్తి నాకు కలదు.

గుణ—కటకటా! నావలె నతడును మోసపోయినాడా!

జయచంద్ర—ఛీ! రంకులాడీ! నాముఖముచుండగ నాతనికయి యేడ్చెదవా?

గుణ—నాథా! నన్ను చంపకుము ఏదేశమయిన పంపనయిన పంపుడు

జయద్ర—నోరుమూసికొమ్ము! లంజా!

గుణ—కటా! కటా! నాథా!—(మూర్ఛిల్లును)

జయద్ర—మూర్ఛిల్లెను! ఆఁ! మూర్ఛకాదు ప్రాణత్యాగ [illegible]
ఘోరకృత్యము నాచేతులతో చేయించక దైవము న్యాయముగ విచారించి తా
మేలొనర్చెను ఇంకను ప్రాణము పూర్తిగా పోలేదు.

దుర్గు—(తెరలో) మహాప్రభూ! మహాప్రభూ!

జయద్ర—ఇంకను పోలేదా? కదలుట మానినది దీపమారిపోయెనే ఇప్పుడే పో
గలదు.

దుర్గు—(తెరలో) మహాప్రభూ! మహాప్రభూ!

జయద్ర—ఎవరువారు?

దుర్గు—(తెరలో) ఒక్కమాట చెప్పవచ్చితిని మహాప్రభూ!

జయద్ర—ఈమాటలు దుర్గుణవనుటకు సందేహము లేదు — పోయియుండునా?
పోయినది. చలనము పూర్తిగా పోయినది — ఆమెను లోనికిరానిచ్చిన నేమి?
ఇప్పుడేమిచేయను? లోనికి వచ్చినతోడన నాభార్యతో మాటాడకమానదు.
నాభార్య! నాభార్య! ఇక నెక్కడిభార్య? నాకు భార్యలేదు. ఈనిమిషము
భరించుట కెంతయశక్యముగా నున్నయది. అబ్బా! ఏమిచేయను? సూర్యచం
ద్రులకేకదినంబున పూర్ణగ్రహణంబులు సంభవించి బ్రహ్మాండకటాహము ముక్క
లయినట్లు తోచుచున్నదిగదా!

దుర్గు—(తెరలో) మహాప్రభూ! తమతో నొక్కవార్త చెప్పవచ్చితిని.

జయద్ర—మరచితిని లోనికిరమ్ము దుర్గుణా— బట్టముసుగువేసెదను. లేనిచో
చూడగలదు—

క॥ తన పాపచింతభయమును
  పెనగొన యీ లేమమిగుల బెదరున దేహం
  బునుబాసె చనెను దైవము
  వనుకూలుడ యిపుడు నాకు నాలోచింపన్.

[దుర్గుణ ప్రవేశించును.]

జయద్ర—ఏమివార్తలు తెచ్చితివి?

దుర్గు—నట్టనడివీధిని దుర్మార్గపుహత్య జరిగెను!

జయద్ర—ఇప్పుడా?

దుర్గు—ఇప్పుడే మహాప్రభూ!

జయద్ర— ఇదియొక గ్రహచారఫలము. ఎద్దియో దుష్టగ్రహము భూమిని సమీపించెనుగాబోలు? జనులకు మతులు చలించుచున్నవి.

దుర్గ—జయంతుడు కాశ్మీర దేశీయుడగు కామపాలుడనువానిని జంపెను.

జయ—జయంతుడు చచ్చెనా? లేక కామపాలుడు చచ్చెనా?

దుర్గ—జయంతుడు చావలేదు.

జయద్ర— జయంతుడు చావలేదా? తలచిన సత్కార్యమునకు గొప్పవిఘ్నము జరిగెనే!

దుర్గ—నిండుగృహమందు దీపములేక నిద్రించెదరేల మహాప్రభూ! అమ్మగారేమి చేయుచున్నారు? (శయ్యజేరి గుండెలు తట్టుకొని) అమ్మగారిట్లు వికృతరూపమున పరుండిరేమి ప్రభూ!

జయద్ర—పరుండలేదు నరకబాధల రుచిచూడబోయినారు.

దుర్గ—అయ్యో! దైవమా! ఏమిమహాప్రభూ! ఏమిప్రభూ!

జయద్ర— రక్కసివలె పుడమిపై పాపములు చేసిచేసి నేటికి నరకమును చేరె. నేనచంపితిని

దుర్గ—ఏమి! ఏమి! ఏమి! ఆమె కేవలము స్వర్గమునకే పోయినది. మీరును తమే దయ్యమువలె రాక్షసికృత్యము చేసినారు!

జయద్ర—తనసుగుణముల క్రమముగా బాసి తుదకు కట్టుజారిణి యైనది

దుర్గ—నీవామెపై నబద్ధములాడుచున్నావు నిజముగా నీవు రాక్షసివే.

జయద్ర—నన్నామె నీటివలె మోసముచేసినది.

దుర్గ— నీవామె నగ్నివలె కారణములేకయె జంపితివి. ఆమె మోసముచేసెనా? ఆమె సద్వర్తనమందు దేవతనివంటిది కాదా?

జయద్ర— నేనిట్టికృత్యము తగినకారణములు లేకయే చేసిన నేనిజముగా శాశ్వతనరక మనుభవించ వలసినదే నీపతి యదియంత యెరుగును.

దుర్గ—నాపతి!

జయద్ర—నీపతి! నీపతియే!

దుర్గ—వివాహ నిబంధనల నతిక్రమించెనని?

జయద్ర—ఔను. జయంతునితో—ఆమెసద్గుణవతియే యైనయెడల, నన్నీ బ్రహ్మాండకటాహమునకెల్ల నధిపతిగా నాకర్పించెదనన్న నేనామెను విడువనొల్లుదునా?

దుర్గ—నాపతి!

జయద్ర— ఔను ఆతడే నాకీసంగతి మొదట తెలియజెప్పెను, మిగుల మర్యాద

స్థుడు. న్యాయదృష్టి గలవాడగుటచే నిట్టి దుష్కార్యములు సహించడు.

దుర్గ—నాపతి!

జయద్ర—ఏమిటిట్లు నొక్కినొక్కి యడిగెదవు? నీ పెనిమిటియేయని చెప్పలేదా?

దుర్గ— అయ్యో! తల్లీ! నీ నిండుప్రేమ నిష్కారణము ద్రోహులచేత పాడు చేయబడినదిగదా! ఆమె జారయని చెప్పినది నాపతియేనా?

జయద్ర—అతడే నీపతియేయని వేయిసారులు చెప్పితిని ఇప్పుడైన తెలిసినదా? నా స్నేహితుడు, నీ పెనిమిటి, న్యాయదృష్టికలవాడు, సత్యవాక్యధురీణుడయిన కలహప్రియుడు

దుర్గ—అట్లు చెప్పిన యెడల నాతని దేహము దినమున కరవడ్లగింజయెత్తున తగ్గుచు క్రమక్రమముగా కుళ్ళికుళ్ళి నశించుగాక! అతడెప్పు డబద్ధము లాడుచునే యుండును, ఆమెయు నీ ప్రీతముఖమును వీక్షించి స్వర్గముగా సంతసించు చుండె.

జయద్ర—హుమ్

దుర్గ—నీ చేతనయిన పని చేయుము, నీ కామె యెంత తగియుండెనో నీ వొనర్చిన కృత్యము దైవమునకంతగా తగియున్నది.

జయద్ర—నీవింతటు నోరుమూసికొనిన బాగుగానుండును!

దుర్గ—నీ వొనర్చగలకీడుకంటె రెట్టింపు కీడొనర్చిన లక్ష్యపెట్టను ఓనిర్భాగ్యుడా! ఓ మందమతీ! బుద్ధిహీనుడా! నీ వొనర్చినపని—నీకత్తినే లక్ష్యపెట్టను, నా ప్రాణమోసమునకయిన నోర్చి నీదుష్కార్యము వెల్లడిచేయకమానను రండి! రండి! హత్య! నరహత్య! జయద్రథుడు గుణవతిని చంపినాడు హత్య! హత్య.

(నీతిమంతుడును, సూక్ష్మబుద్ధియు, కలహప్రియుడు మొదలగువారును కాగడలతో ప్రవేశించుచున్నారు)

నీతి—ఏమండీ జయద్రథా! ఏమివార్తలు?

దుర్గ—కలహప్రియా! వచ్చితివా? మంచిపని జేసితివే. ఈహత్యలెల్ల నీ నెత్తిపయి బడుచున్నవి

సూక్ష్మ—ఏమిసంగతి?

దుర్గ—నీకు మగతనము గలదేని యీదుర్మార్గుని దుర్మార్గము బయలుపుచ్చుము. తన భార్య జారయని నీవు చెప్పితివని చెప్పుచున్నాడు నీవు యోగ్యుడవుగాన యట్లు చెప్పియుండవని నమ్మెదను. నా మనస్సు పూర్ణముగా నున్నయది. త్వరితముగా చెప్పుము.

కల—ఆతఁడు కన్నులార చూచినవిషయములును, చెవులతో విన్న విషయములును తప్ప వేరు నేనేమియు నాకబద్ధములని తోచిన సంగతులు చెప్పలేను

దుర్గ—ఆమె జారయని యెప్పుడయిన చెప్పియుంటివా?

కల—చెప్పితిని

దుర్గ—నీవనృతము నుడివినావు భయంకరమగు పాపకారణమునగు నబద్ధము నాడితివి నా యాత్మతోడు! ఎంతకూరగమగుదబ్బర! జయంతుని ప్రేమించెనని నీవు చెప్పినది.

కల—జయంతునితోనే! సఖీ! నీ కామాటలేల నీవూరకొమ్ము.

దుర్గ—నేనూరకొనను ఊరకొనుటకు సమయముగాదు. నేను మాటాడనటకిప్పుడు బద్ధురాలనయి యున్నాను. మా యజమానురాలుగారు చంపబడి శయ్యాపయి బడియున్నారు— ఆ బట్టముసుగు చూడుడు!

అందరు—అయ్యో! అయ్యో! ఏమి యీవింత?

దుర్గ—ఈపని నీబోధవల్ల జరిగినదట!

జయద్ర—తెల్లబోయి చూచెదరేల? ఇది నిజమయిన వార్తయే.

సూక్ష్మ—ఇది చిత్రమైననిజము.

నీతి—అయ్యో రాక్షసికృత్యమా!

దుర్గ—ద్రోహము ద్రోహము ద్రోహము! నాకాలోచన పాలుపోవుట లేదు. తలచినంత దేహము కంపము జెందుచున్నయది. అయ్యో ద్రోహమా! నేనిది మునుప యూహించితి! ఇంత విచారముతో బ్రతుకగూడదు. అయ్యో ద్రోహమా! ద్రోహమా!

కల—నీకు పిచ్చిపట్టినదా? త్వరితముగా నింటికిపొమ్ము.

దుర్గ—ప్రభువులారా! నన్ను మాటాడనిండు. నేనీతనికి విధేయత చూపుటకు దగిన సమయ మిది కాదు. కలహప్రియా! ఇంటికి నేనింక నెన్నటికి పోకపోవచ్చును.

జయద్ర—అయ్యో! అయ్యో! అయ్యో! (మరియొక పరుపుపై పడి యేడ్చుచున్నాడు)

దుర్గ—భూమిపైబడి పొరలుచు మరియేడ్వుము; పరపురుషులవంక కన్నెత్తిచూడని పరమపతివ్రతాశిరోమణిని చంపివైచితివి.

జయద్ర—గొప్పపాపకృత్యము లాచరించినది. మిమ్ము చూడలేదు మామా. మీ కొమార్తె ప్రాణములువీడి యిచ్చటన పడియున్నది. నేనొనర్చినపని మాత్రము

ఘోరముగా కనుపించకమానదు.

సీత—అయ్యో గుణవతీ! నీతండ్రి కడు నదృష్టవంతుడు గాన నీకంటె ముందు పరలోకగతుడై నాడు నీవివాహస్థితి దలచి కృశించకృశించి తుదకు ప్రాణత్యాగము చేసినాడు. ఇప్పుడాతడు బ్రతికియుండి యీవార్త నిన నేమి చేసియుండును.

జయద్ర—ఇదినిజముగా విచారకరమగు నంశమే. నీభర్తయైన జయంతునకు నామెకు గల సంబంధమును ఆతనితో నామె యెన్నివేలసారు లాదుష్కార్యమాచరించినది సర్వము నీకలహప్రియుడెరుగును జయంతుడీవృత్తాంతమంతయు జెప్పకొనెను. తన జ్ఞాపకార్థమాతనికి నేను తన వివాహమునాడు మక్కువచే తన కొసగిన రుమాలు జయంతునకు కానుకగా నిచ్చెను. దానిని నేనాతని యొద్ద చూచితిని అది నాతండ్రి నా తల్లికొసగిన మొదటి బహుమానము.

దర్గ—అయ్యో దైవమా! ఓ పంచభూతములారా!

కల—నోరుమూసికొమ్ము.

దుర్గ—ఆమాట మనస్సున నిముడబు రాకమానదు. నేనూరకొనను. నేనెడారి యొడగాడుపువలె తీవ్రముగా మాటాడెదను దైవమును, మనుష్యులును, దయ్యములును, నన్నడ్డము పెట్టినమానను.

కల—తెలివిగలిగి యింటికిపొమ్ము

దుర్గ—నేపోను.

[కలహప్రియుడు దుర్గను పొడువబోవును]

సూష్మ—ఛీ! ఆడదానిమీదనా నీసాము.

దుర్గ—ఓ మూర్ఖశిఖామణీ జయద్రథా! నీవు చెప్పుచున్న రుమాలు నాపతి కేనొసంగితి తనకా రుమాలు ముఖ్యముగా కావలెననియు, దానిని దొంగిలించియైన తనకిమ్మనియు కడు నాతృతతో ననేక యెన్నిసారులో యడుగుచు వచ్చెను తుదకదినాకు దొరకనతనికొసగితిని.

కల—ఛీ! ఛీ! తార్పుకత్తియా!

దర్గ—ఆమె జయంతునకొసగెనా! లేదు! లేదు! నాపతికది నేనొసంగితి.

కల—తొత్తా! నీవబద్ధమాడుచున్నావు.

దుర్గ—దైవసాక్షి. లేదు, లేదు, నేనబద్ధమాడుటలేదు ప్రభువులారా! ఓ దుష్టమృగమా! అంతమంచియిల్లాలి నిట్టి భాగ్యహీనుడేమి చేయగలడు? అయ్యో! అయ్యో [మూర్ఛిల్లును]

జయద్ర—ఆకాశంబున పిడుగులయి పడుటకు తగినరాళ్ళు లేవని నమ్మెదవు?—పరమఘాతకా!

[కలహప్రియునివైపు పరుగుపెట్టును, కలహప్రియుడు పారిపోవును]

నీతి—ఈతడొకడు ఘాతకుడు నేనిప్పుడ జయద్రథునుండి చేకొనిన యీ యాయుధము నీవు చేబూని కావలిగాయుచుండుము అతని చంపనైన చంపుము గాని వెలుపలకుమాత్రము రానియ్యకుము నేనుపోయి యాదుష్టుని కొనితెచ్చెద. అంత దుష్టుని విడుచుట పాడిగాదు (నీతి నిష్క్రమించెను)

జయద్ర— నాధైర్యమును బలమునుగూడ నడిచినవి. ప్రతిమరిగుజ్జయును నాచేతి కత్తి పెరికికొన సమర్థుడగుచున్నాడు పతిభక్తికంటె మర్యాద యెక్కువ కాలమేల బ్రతుకవలెను? అన్నియు నొక్కమారపోవలెను ఇచ్చటనే మరి యొక కత్తిగూడగలదు ఇదిబహుమంచికత్తి ఇదెదొరికినది అయ్యో! వచ్చుచున్నాను జాగ్రత

సూక్ష్మ—(తనలో) మీరట్లు జేసితిరేని మిక్కిలి శ్రమల పొలగుదురు మీయొద్ద నాయుధములయిన లేవు

జయద్ర—నావయిపుజూచి మాటాడకుడు. ఇప్పుడె నేను మీతో పోరాటమునకు డీకొనియెదను

[సూక్ష్మబుద్ధి ప్రవేశించును.]

సూక్ష్మ—ఏమిసంగతి?

జయద్ర—నాయొద్ద నెంతమంచికత్తిగలదో చూడుడు ఏశూరుడుగాని యింతకంటె మంచికత్తినెన్నడయిన తనతొడపయి నిడుకొనెనా? ఈకత్తిని ధరించి యీ చిన్ని హస్తముతో మీకంటె నిరువదిరెట్లు బలముగల జనముతో పోరాడి గెలిచితిని కటా! ఎందుకు నాప్రజ్ఞ! కాలమున కెదురెవ్వడు నడువ గలడు? నాచేత కత్తికలదని మీరుభయపడకుడు మీరింటికి విచారించుచుబోయెదరు గాబోలు! జయద్రథుడు నెవ్వరేని యెదిరించినంతమాత్రము నాతనిచే జయింప బడును. ఇక నాతడెక్కడకుపోగలడు? అయ్యో! ప్రాణేశ్వరీ! నీపూర్ణచంద్ర నిభాననం బిప్పుడెట్లున్నది? ఎంత వికృతాకారము దాల్చితివి. నేను నీశయ్యా దరికయిన జేరలేను నిన్నిట్టులజూచుటవలన యమలోకమున మండుచున్నయినుప స్తంభమును కౌగిలించుకొనినట్లున్నది అయ్యో దుష్టుడా! ఎంతపని జేసితివి ఓ యమదూతలారా! ఇంతపని నొనర్చినందుకు నన్ను మిక్కిలి బాధించుడు. మండుచున్న గంధకములోనుంచి పిమ్మట నగ్నిలకాల్చుడు గుణవతీ! గుణవతీ! గుణవతీ! అయ్యో! అయ్యో! అయ్యో!